www.udyamakeratam.com
RNI: TGTEL/25/A0273
1వ వార్షికోత్సవం
# ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక
| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 48 | 26-7-2026 | ఆదివారం | పేజీలు: 8 | వెల : రూ.2/-




# ధర్మేంద్ర రాజీనామా
# విద్యార్థుల విజయం

- విద్యార్థులపై పెట్టిన కేసులు ఎత్తేయాలి
- రాహుల్, మల్లికార్జున ఖర్గేలు మరింత గళం ఎత్తుతారు
- చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించాలి
- క్యాండిల్ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 25:**
నీట్ పేపర్ లీకేజ్, విద్యావ్యవస్థలోని అక్రమాలకు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ (ఛాత్ర/యువజన పోరాట వేదిక) ఆధ్వర్యంలో జరిగిన నిరసనలు, మరియు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వంటి పరిణామాలతో విద్యార్థులు సాధించిన విజయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గట్టిగా సమర్థించారు. శనివారం విద్యార్థుల పోరాటానికి మద్దతుగా నిర్వహించిన క్యాండిల్ ర్యాలీలు, సభల్లో ఆయన ప్రసంగించారు. యువ మిత్రుల మోహాల్లో విజయ దరహాసం నాకు కనిపిస్తోంది.ఈ రోజు జన్ జీ అన్నదమ్ముళ్ల మోహాల్లో విజయదరహాసం కనిపిస్తోంది..కాని ఇది సరిపోదు.జన్ జీ యువత 58 ఇంచుల ఛాతిని ఓడించి విద్యా శాఖ మంత్రి రాజీనామా వరకు తెచ్చారు.నీట్ పరీక్ష పత్రాలు లీక్ కావడంతో ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం ఇవ్వలేదు...పోరాటం లో విద్యార్థులపైన పెట్టిన కేసులను ఎత్తివేయలేదు..కేంద్ర ప్రభుత్వం పరీక్షా నిర్వహణలో విఫలం కావడం వల్ల అనేక మంది విద్యార్థుల

మిగతా 2వ పేజీలో..

## దేశ వ్యతిరేక శక్తులకు అవకాశం ఇవ్వరాదనే..
2

- రాజీనామా లేఖలో పేర్కొన్న ధర్మేంద్ర ప్రధాన్

## ప్రజాశక్తి ఎప్పుడూ గొప్పదే

- ధర్మేంద్ర రాజీనామాపై కేటీఆర్ పోస్ట్


2

## విద్యార్థుల పోరాటానికి తలొగ్గిన మోదీ


2

- కేంద్రం దిగిరాక తప్పని పరిస్థితి
- మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం
- కేంద్రం తీరుపై మండిపడ్డ కాంగ్రెస్ నేతలు

## ధర్మేంద్ర రాజీనామా.. యువత సాధించిన విజయం

- మాజీ మంత్రి హరీష్ రావు

**హైదరాబాద్,జులై 25 :**
నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో సీజీపీతోపాటు విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో వారి డిమాండ్ల మేరకు

మిగతా 2వ పేజీలో..



## ఇందిరమ్మ టవర్స్‌పై కాల్ సెంటర్


- యూపీఐ ద్వారానే రూ.10వేల ఈఎండీ చెల్లించాలి
- ఇల్లు రాకపోతే అదే ఖాతాకు తిరిగి చెల్లిస్తాం
- దరఖాస్తు సమయంలో ఆధార్ నంబరు చాలు
- పదేళ్లు క్యూర్ పరిధిలో నివాసం ఉన్నవారికే
- 040-24603572ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి

3

## రియల్ ఎస్టేట్‌పై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

- రెండున్నరేళ్లలో దాదాపు 40 శాతం 'రియల్' వృద్ధి
- త్వరలో మూసీ సుందరీకరణకు టెండర్లు
- రియల్ ఎస్టేట్‌తోపాటు పేదల ఇళ్ల నిర్మాణానికీ ప్రాధాన్యత
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి

3



## పదవులు తాత్కాలికం.. ప్రజా విశ్వాసమే అంతిమం

- కేంద్ర మంత్రి బండి

**హైదరాబాద్,జులై 25 :**
'పదవులు తాత్కాలికం, ప్రజల విశ్వాసమే అంతిమం' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు నడవడమే ప్రజాస్వామ్యమని చెప్పారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ఆయన స్పందించారు. తమకు పార్టీ కంటే.. దేశమే ప్రధానమన్నారు. 'ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం అంటే.. ప్రజల గొంతు వినడం, వారి మాటను గౌరవించడం, అవసరమైతే బాధ్యత తీసుకునే ధైర్యాన్ని కలిగి ఉండటం. భాజపా దాన్నే పాటిస్తుంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పార్టీ విలువలను ప్రతిబింబిస్తుంది. ఇన్నేళ్లపాటు దేశసేవలో భాగమైనందుకు ధర్మేంద్ర ప్రధాన్‌కు ధన్యవాదాలు' అని ఎక్స్‌లో పోస్టు చేశారు.



## ఎల్‌నినోతో రైతులకు అండగా నిలవండి

- డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రోత్సహించండి
- మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల సూచన



2

## జంతర్ మంతర్ ఆందోళనకు ముగింపు



- కేంద్ర మంత్రులతో సీజేపీ ప్రతిధుల చర్చలు ఫలప్రదం
- విద్యార్థులపై దేశవ్యాప్త కేసుల ఎత్తివేతకు అంగీకారం
- భవిష్యత్‌లో ఎలాంటి కేసులతో విద్యార్థులను వేధించమని హామీ

4



# కమలనాథుల్లో షా టెన్షన్

- కరీంనగర్ పర్యటనతో రాష్ట్ర నేతల్లో పెరిగిన ఉత్కంఠ
- నేడు తెలంగాణకు రానున్న అమిత్ షా
- రాష్ట్ర పార్టీ పరిస్థితులపై కేంద్రానికి చేరిన సమగ్ర నివేదిక
- నేతల మధ్య విభేదాలపై అధిష్ఠానం ప్రత్యేక నిఘా

**హైదరాబాద్, జూలై 26:**
తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో భారతీయ జనతా పార్టీ అధిష్ఠానం రాష్ట్ర రాజకీయాలపై ప్రత్యేక

మిగతా 2వ పేజీలో..



## రూ.547 కోట్లు కాదు.. రూ.1,000 కోట్లు!

- సత్తుపల్లి సైబర్ మోసాల కేసులో సంచలనం
- రంగంలోకి 'సిట్'
- రాష్ట్రంలోనే అతిపెద్ద సైబర్ ఆర్థిక నేరం
- టీసీఎస్బీ డీఎస్పీ మురళీధర ప్రసాద్ నేతృత్వంలో దర్యాప్తు

**సత్తుపల్లి/ఖమ్మం, జూలై 25 :**
ఖమ్మం జిల్లాలో వెలుగులోకి వచ్చిన భారీ సైబర్ మోసాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ప్రారంభంలో రూ.547 కోట్ల అనుమానాస్పద లావాదేవీలుగా గుర్తించిన ఈ కేసు,

మిగతా 3వ పేజీలో..

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
ఆదివారం
26 జూలై 2026

# ధర్మేంద్ర రాజీనామా విద్యార్థుల విజయం

**మొదటిపేజీ తరువాయి**

నష్టపోయారు..రాహుల్ గాంధీ, మల్లిఖర్జున్ ఖర్గే, ఎంపీలు సభలో మరింత ఎక్కువ గళం ఎత్తుతారు..విద్యార్థులపైన పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలి..చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలి..అంబేద్కర్, ఇందిరమ్మ సాక్షి గా వేలాది మంది జన్ జీ యువత ఇక్కడికి తరలివచ్చారు..ఇక్కడికి వచ్చిన వారంతా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కాదు..భారతదేశ యువత సాధించిన విజయాన్ని కాంగ్రెస్ ఖాతాలో రాసుకోదల్చుకోలేదు.. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా జన్ జీ పోరాట ఫలితం..పోరాటానికి ప్రధాని మోదీ తలవంచి ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా చేయించాడు.. ఈ విజయం మీది..ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తో సరిపెట్టుకోకుండా అక్రమ కేసులను తొలగించడానికి, చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు సాయం కోసం ఈ ర్యాలీ చేపట్టాం..కుటుంబాలకు అండగా ఉంటాం.. మోదీ వైఫల్యాల పైన పోరాడుతామని వేలాది మంది అంబేద్కర్ సాక్షిగా వచ్చారు..ఈ దేశం జన్ జీ ది..దేశ భవిష్యత్తే యువతరం భవిష్యత్తు..దేశం భవిష్యత్తు బాగుంటే యువతరం భవిష్యత్తు బాగుంటుంది.. ప్రజాస్వామిక వాదులంతా దిక్కులు పిక్కటిల్లేలా యువతకు మద్దతు ఇచ్చారు. జంతర్ మంతర్ నుంచి జన్ జీ పార్లమెంటుకు వెళ్లాలి..రాజీవ్ గాంధీ 61 వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు నుంచి 21 యేళ్ల నుంచి 18 యేళ్లకి తగ్గించారు..18 యేళ్ల కే యువతకు ఓటు హక్కు రావడం వెనుక రాజీవ్ గాంధీ ఉన్నారు..స్థానిక సంస్థలు, శాసనసభ, లోక్ సభ లు ప్రధానమైన చట్ట సభలు..మాజీ ప్రధాని పీవీ నరసింహా రావు 73,74 రాజ్యాంగ సవరణ తీసుకువచ్చి స్థానిక సంస్థల్లో పోటీ చేయడానికి 21 యేళ్లకు తగ్గించారు..21 యేళ్లకు ఒక సోదరిమణి త్రివేండ్రం మేయర్ అయ్యారు..సివిల్ సర్వీస్ కు అర్హత 21 ఏళ్లు మాత్రమే..21 ఏళ్లకు మన తెలుగమ్మాయి శ్రీ లక్ష్మి ఐఏఎస్ సాధించింది..మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన డి అనన్య అనే అమ్మాయి 22 ఏళ్లకు ఐఏఎస్ సాధించింది..32 ఏళ్ల క్రితం తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఐపిఎస్ సాధించారు..అసెంబ్లీ కి పోటీచేయడానికి మన దేశంలో 25 ఏళ్లు, రాజ్యసభకు 30 ఏళ్ల అర్హత పెట్టారు..జర్మనీ,బ్రిటన్ లాంటి దేశాల్లో 18 ఏళ్ల కే పోటీ చేసే హక్కు కల్పించారు..సింగపూర్ లో 21 యేళ్ల కే పోటీ చేసి ప్రధాన మంత్రి కావొచ్చు..ఆగస్టు మొదటి వారంలో అసెంబ్లీ, శాసనమండలి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ఎమ్మెల్యే, ఎంపీగా పోటీ చేసే వయసు 21 ఏళ్లు గా ఉండాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తాం..పార్లమెంటులో రాహుల్ గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గే నాయకత్వంలో ఈ బిల్లును ఆమోదించేలా కృషి చేస్తాం..జన్ జీ యువత విద్యాశాఖ , ఐటీ శాఖల మంత్రులుగా ఉంటే దేశం ముందుకు పోతుంది..కేంద్రంలో కూడా విద్యా మంత్రి గా జన్ జీ కి అవకాశం కల్పించడానికి నేను రాహుల్ గాంధీ, ఇండియా కూటమితో మాట్లాడుతా..ప్రపంచానికి జన్ జీ గళం వినిపించాలి.. ఆ దిశగా మేం పనిచేస్తాం..పార్లమెంటులో ఒక్క శాతం లోపే జన్ జీ ప్రాతినిధ్యం ఉంది..ముప్పై శాతం ఉన్న జన్ జీ లకు చట్టసభల్లో అవకాశం కల్పించాల్సి ఉంది..21 యేళ్ల వయసు లో యువతీ యువకులు చట్టసభలకు పోటీ చేసే అవకాశం ఉండాలి..ఈడీ, సీబీఐ లాంటి వాళ్లతో అక్రమ కేసులు పెట్టి రాజకీయ పార్టీలను లొంగదీసుకునే ప్రయత్నం చేశారు..మోదీని, కేంద్రాన్ని గుండె ధైర్యంతో లాఠీలు, తూటాలకు ఎదురొడ్డి ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా చేయించారు.. మిమ్మల్ని అభినందిస్తున్నాను.ఈ సునామీ ఇంతటితో ఆగొద్దన్నారు.

# విద్యార్థుల పోరాటానికి తలొగ్గిన మోదీ

**హైదరాబాద్,జులై 25:**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల సుదీర్ఘ ఉద్యమానికి దక్కిన విజయమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. విద్యార్థుల డిమాండ్లపై కేంద్రం దిగివచ్చిందని, ఈ పరిణామం ప్రభుత్వాలకు ఒక కనువిప్పుగా మారాలన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఉద్యమానికి దక్కిన విజయమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విద్యార్థుల హక్కులు, వారి భవిష్యత్తు కోసం దేశవ్యాప్తంగా వ్యక్తమైన ఆందోళనల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చిందని ఆయన అన్నారు. విద్యార్థుల ఆవేదనను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు గురైందని, చివరకు ప్రజల ఒత్తిడి ముందు తలవంచక తప్పలేదని వ్యాఖ్యానించారు. ఇది కేవలం ఒక మంత్రి రాజీనామా మాత్రమే కాదని, ప్రజల గొంతుకకు లభించిన గౌరవమని పొన్నం ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఎంతటి ప్రభుత్వమైనా మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొన్నారు. ఈ రోజు దిగివచ్చిన ప్రభుత్వం రేపు గద్దె దిగక తప్పదని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. విద్యార్థుల ఆకాంక్షలను విస్మరించిన ప్రభుత్వాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఉద్యమానికి, కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీయేతర రాజకీయ పక్షాల పోరాటానికి దక్కిన విజయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన అంశాల్లో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయని, వాటి ఫలితంగానే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకను ప్రభుత్వం గౌరవించక తప్పదని, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ తన పదవి కాపాడుకోవడానికే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించారని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ విమర్శించారు. నీట్ పరీక్ష లీక్ జరిగినప్పుడే కేంద్ర ప్రభుత్వం స్పందించి ఉంటే పరిస్థితి ఇంత వరకూ వచ్చేదే కాదన్నారు. మూడు నెలల పాటు ఎందుకు తాత్సారం చేశారని ప్రశ్నించిన ఆయన.. విద్యార్థులపై పెరిగిన ఒత్తిడి, నిరసనల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల పోరాటానికి దక్కిన విజయమని పేర్కొన్నారు. యువత తమ దమ్ము ఏంటో నిరూపించారని, వారి పోరాట ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఉద్యమంలో పాల్గొన్న యువతపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనల నేపథ్యంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. భవిష్యత్తులో పేపర్ లీకులు జరగకుండా కఠిన చర్యలు తీసుకుని విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ విద్యార్థులు, యువత పోరాటానికి దక్కిన విజయమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. ఈ పరిణామంతో బీజేపీ పతనం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. విద్యార్థుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని, నీట్ ప్రశ్నపత్రాల లీక్‌పై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. యువతకు న్యాయం జరిగే వరకు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకుని పరీక్షల నిర్వహణలో లోపాలను సరిదిద్దాలని కేంద్రాన్ని కోరారు. విద్యార్థుల డిమాండ్లకు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల సుదీర్ఘ పోరాటానికి దక్కిన విజయమని పేర్కొన్నారు. ఈ పరిణామం ప్రస్తుత ప్రభుత్వాలతో పాటు భవిష్యత్తులో వచ్చే ప్రభుత్వాలకు కూడా ఒక కనువిప్పుగా మారాలని అన్నారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వాలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

# ఎల్‌నినోతో రైతులకు అండగా నిలవండి

**హైదరాబాద్, జూలై25:**

ఎల్‌నినో సమయంలో రైతులకు అండగా నిలవాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎల్‌నినో సవాళ్లకు డ్రిప్, తుంపర సేద్యమే పరిష్కార మార్గమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ సచివాలయంలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశమయ్యారు. డ్రిప్ వ్యవస్థల ఏర్పాటును వేగవంతం చేయాలని ఆ కంపెనీలకు మంత్రి సూచించారు. పెండింగ్‌లో ఉన్న డ్రిప్ పనులకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. బీఎంఎస్, బీఓక్యూలను పూర్తి చేసి వెంటనే అనుమతుల కోసం పంపాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలన, పరిపాలనా అనుమతుల్లో జాప్యానికి తావివ్వొద్దని మంత్రి తుమ్మల సూచించారు. డ్రిప్ వ్యవసాయ పద్ధతిలో తక్కువ నీరు, విద్యుత్ ఉపయోగించి అధిక దిగుబడి సాధించవచ్చని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. పంటల వైవిధ్యీకరణకు మైక్రో ఇరిగేషన్ కీలకమని అన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు డ్రిప్ సదుపాయాలను వెంటనే కల్పించాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు హుకుం జారీ చేశారు. అవగాహన కార్యక్రమాల్లో ఆయా కంపెనీలు తప్పనిసరిగా పాల్గొనాలని, పెండింగ్ బిల్లుల చెల్లింపునకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గత రెండేళ్లలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.400 కోట్లు చెల్లించిందని ఈ సందర్భంగా వెల్లడించారు. కంపెనీల పనితీరుపై జిల్లాల వారీగా నిరంతర సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. సూక్ష్మ సాగునీటి విస్తరణలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలవాలని మంత్రి తుమ్మల ఆకాంక్షించారు.



## రాజన్న ఆలయానికి మరో రూ.99.40 కోట్లు విడుదల

- **ఉత్తర్వులు జారీ చేసిన అధికారులు**
- **గత బడ్జెట్‌లో రూ.50 కోట్లు, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.100 కోట్లు**

**వేములవాడ, జూలై 25 :**

దక్షిణ కాశిగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆలయ అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే 2023 24 బడ్జెట్‌లో రూ.50 కోట్లు, 202425 బడ్జెట్‌లో రూ.100 కోట్లు విడుదలవగా శనివారం మరో రూ.99.40 కోట్లు విడుదల చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో రూ.150 కోట్లతో సుమారు 45 శాతం పనులు పూర్తికాగా మరో రూ.99 కోట్లు విడుదల కావడంతో ఆలయ అభివృద్ధి విస్తరణ పనులు మరింత వేగంగా జరగనున్నాయి. కాగా, విధులు మంజూరుకు కృషిచేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధన్యవాదాలు తెలియజేశారు.

# కమలనాథుల్లో షా టెన్షన్

**మొదటిపేజీ తరువాయి**

దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేడు కరీంనగర్ పర్యటనకు రానుండటంతో రాష్ట్ర బీజేపీలో రాజకీయ కదలికలు వేగం పుంజుకున్నాయి. రాష్ట్ర పార్టీ పరిస్థితులు, నాయకుల పనితీరుపై ఇప్పటికే కేంద్ర నాయకత్వానికి సమగ్ర నివేదిక చేరినట్లు ప్రచారం జరుగుతుండగా, అమిత్ షా పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది.

**రాష్ట్ర నాయకత్వంపై అధిష్ఠానం దృష్టి**


తెలంగాణ బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ అభయ్ పాటిల్ ఇటీవల రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ సంస్థాగత బలం, నాయకుల పనితీరుపై సమగ్ర నివేదికను కేంద్ర నాయకత్వానికి అందించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి అవసరమైన చర్యలు, నాయకుల సమన్వయంపై కూడా ఆయన ప్రత్యేకంగా సూచనలు చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల కీలక నేతల మధ్య జరిగిన సమావేశాలు కూడా అధిష్ఠానం సూచనల మేరకే జరిగాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

**అమిత్ షా సమావేశంపై ఆసక్తి**

కరీంనగర్‌లో ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్న అమిత్ షా, రాష్ట్ర బీజేపీ ముఖ్య నాయకులతో కూడా సమావేశమయ్యే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. గత పర్యటనల్లో పార్టీ పరిస్థితులు, నాయకుల పనితీరుపై నేరుగా సమీక్షించిన అనుభవం ఉండటంతో ఈసారి కూడా అలాంటి సమావేశం జరిగే అవకాశాలపై నాయకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

**నేతల్లో పెరిగిన ఉత్కంఠ**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యక్తమవుతున్న అసంతృప్తిని పార్టీకి అనుకూలంగా మలచడంలో ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించడం లేదనే అభిప్రాయాలు బీజేపీ వర్గాల్లో వినిపిస్తున్నాయి. మరోవైపు అంతర్గత విభేదాలు పూర్తిగా సమసిపోలేదనే చర్చ కూడా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అమిత్ షా నాయకుల పనితీరు, పార్టీ కార్యక్రమాలపై ఆరా తీసే అవకాశం ఉందన్న అంచనాలతో పలువురు నేతలు గత కొంతకాలంగా చేపట్టిన కార్యక్రమాల వివరాలను సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం.



**ఎన్నికల వ్యూహానికి దిశానిర్దేశం?**

రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజల్లో పార్టీ విస్తరణ, కార్యాచరణపై అమిత్ షా కీలక సూచనలు చేసే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఆయన పర్యటన అనంతరం తెలంగాణ బీజేపీ రాజకీయ వ్యూహంలో కొన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశముందనే చర్చ కూడా సాగుతోంది. రాష్ట్ర నాయకత్వానికి స్పష్టమైన కార్యాచరణను నిర్దేశించే పర్యటనగా ఇది నిలవొచ్చని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# ప్రజాశక్తి ఎప్పుడూ గొప్పదే

**హైదరాబాద్,జులై 25:**

యావత్ దేశాన్ని కుదిపేసిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సీజీపీ కాక్రోచ్ జనతా పార్టీతోపాటు విద్యార్థుల ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో వారి డిమాండ్ల మేరకు ధర్మేంద్ర ప్రధాన్ తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. అధికారంలో ఉన్నవారి కంటే ప్రజల శక్తి ఎప్పుడూ గొప్పదన్నారు. దిల్లీలో విద్యార్థులు, యువతపై కేంద్ర ప్రభుత్వం చేసిన దాష్టీకానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద శుక్రవారం నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమానికి మహా నగరంతోపాటు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిమంది యువతీ యువకులు దండుకట్టి తరలివచ్చారు. ఈ కార్యకమంలో కేటీఆర్ భావోద్వేగంతో ప్రసంగించారు. పరీక్ష పే చర్చ పెట్టిన మీరు పేపర్ లీకేజీలపై ఎందుకు పెట్టలేదు.. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది అని కేంద్రాన్ని నిలదీశారు. దిల్లీలో పిల్లలపై దాడులను చూస్తుంటే ఇద్దరు పిల్లల తండ్రినైన తన మనస్సు చలించిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ, రేవంత్ ప్రభుత్వాలపై తనదైన శైలిలో పంచులు విసిరారు. దిల్లీలో యువతపై మోదీ సర్కార్ సాగిస్తున్న దమనకాండను కండ్లకుకట్టారు. రేవంత్ దాగుడు మూతలను ఎత్తిచూపారు. దిల్లీ వీధుల్లో న్యాయం కోసం పోరాడుతున్న యువకులపై ఉగ్రవాదులు, దేశద్రోహులు, పాకిస్థాన్ నుంచి నిధులు వస్తున్నాయని అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. నిజంగానే కేంద్రానికి బాధ్యత ఉంటే ఉద్యమిస్తున్న విద్యార్థుల వద్దకెళ్లి చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాల్సి ఉండేదన్నారు.

## దేశ వ్యతిరేక శక్తులకు అవకాశం ఇవ్వరాదనే..

**ఢిల్లీ**

తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోదీకి పంపినట్లు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. జంతర్ మంతర్‌తోపాటు దేశవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని దేశ వ్యతిరేక శక్తులు దీనిని ఉపయోగించుకోకుండా ఉండేందుకు, జాతీయ ఐక్యత కాపాడేందుకు, విద్యార్థుల భవిష్యత్తు న్యాయపరమైన చిక్కుల్లో పడకుండా ఉండేందుకు తాను రాజీనామా సమర్పించినట్లు వెల్లడించారు. గత నాలుగు దశాబ్దాలుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్కరణలోకి పనిచేస్తున్నామని, దేశ యువత ఆకాంక్షలను నెరవేర్చడం తన నైతిక బాధ్యతగా భావించినట్లు రాజీనామా లేఖలో ఆయన పేర్కొన్నారు. 2026 మే 3న నిర్వహించిన 'నీట్'లో అవకతవకలు వెలుగులోకి రావడంతో కేంద్ర ప్రభుత్వం వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించిందని ధర్మేంద్ర గుర్తు చేశారు. పరీక్షను రద్దు చేసి, మళ్లీ నిర్వహించడంతోపాటు వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. 20 లక్షల మందికి పైగా విద్యార్థుల కోసం తిరిగి పరీక్ష విజయవంతంగా నిర్వహించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో జూన్ 21న పరీక్ష విజయవంతంగా పూర్తయిందని అన్నారు. ఎగ్జామ్ మాఫియా వల్ల ప్రతిభావంతులైన విద్యార్థులు నష్టపోకుండా కృషి చేశానని ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. ఈనెల 16న ప్రకటించిన ఫలితాల్లో పేద, వెనకబడిన వర్గాలకు చెందిన అనేకమంది విద్యార్థులు విజయాన్ని సాధించడం సంతోషకరమని అన్నారు. ఇదే సమయంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు విద్యార్థుల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం తనను బాధించిందన్నారు. పది రోజులుగా జరిగిన పరిణామాలు కలిచివేశాయని, ఇది తన వ్యక్తిగత ప్రతిష్ఠకు సంబంధించిన విషయం కాదని స్పష్టం చేశారు. తనపై నమ్మకం ఉంచిన ప్రధాని మోదీకి, కేంద్ర మంత్రివర్గ సహచరులకు, విద్యాశాఖ అధికారులకు ధన్యవాదాలు చెప్పారు. దేశ సేవే తన జీవిత లక్ష్యమని, భవిష్యత్తులోనూ ఒడిశా ప్రజలు, దేశ యువత కోసం సేవ చేస్తూనే ఉంటానన్నారు.

## ధర్మేంద్ర రాజీనామా.. యువత సాధించిన విజయం

**మొదటిపేజీ తరువాయి**

ధర్మేంద్ర ప్రధాన్ తలొగ్గుతూ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తమ మూడు డిమాండ్లు నెరవేరడంతో ఆందోళన విరమిస్తున్నట్లు సీజీపీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు స్పందించారు. తాజా సందర్భాన్ని దేశంలోని యువతకు ఇది ఒక గొప్ప విజయంగా హరీశ్ రావు అభివర్ణించారు.. సామాజిక దృక్పథంలో వస్తున్న మార్పు నిజంగానే కనిపిస్తోంది. విద్యార్థులందరికీ అభినందనలు.. అంటూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఈ గొప్ప దేశంలోని విద్యార్థులు, యువత, 'జెన్‌జెడ్' టీంకు అభినందనలు. ఈ విజయం మీదే. మీకు మా మద్దతును అందించినందుకు సంతోషంగా ఉంది.. అంటూ బీఆర్ఎస్ పార్టీ ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేసింది.



## ఏవోయూ డిగ్రీ, పీజీ ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరణ

**హైదరాబాద్, జూలై 25:**

డా.బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(ఏవోయూ) 202627 విద్యా సంవత్సరానికి సంబంధించిన అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ), పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) ప్రవేశాల పోస్టర్‌ను యూనివర్సిటీ ప్రాంగణంలో వైస్‌ఛాన్సలర్ ప్రొ. ఘంటా చక్రపాణి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ (బీ.ఏ/బీ.కాం/బీ.ఎస్సీ) కోర్సులు, పీ.జీ - ఎం.ఏ (తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ, అర్థశాస్త్రం, చరిత్ర, ప్రభుత్వ పాలనా శాస్త్రం, రాజనీతి శాస్త్రం, సామాజ శాస్త్రం, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్), ఎం.కాం, ఎం.బి.ఏ, ఎం.బి.ఏ(హెచ్‌హెచ్‌సీఎం), ఎం.ఎస్సీ(వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, పర్యావరణ శాస్త్రం, గణితశాస్త్రం, అనువర్తిత గణితశాస్త్రం కోర్సులు), ఎం.ఎల్ఐఎస్సి, డిప్లొమా, పలు సర్టిఫికెట్ కోర్సుల్లో అడ్మిషన్ లు జరుగుతున్నాయన్నారు. ఆయా కోర్సుల్లో చేరడానికి విద్యార్హతలు, ఫీజు తదితర వివరాలను www.braouonline.in; లేదా www.braou.ac.in లో తెలుసుకోవచ్చన్నారు. డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్ పొందడానికి ఇంటర్ లేదా తత్సమాన విద్యార్హత, లేదా పదో తరగతి తర్వాత ఏదేనీ రెండు సంవత్సరాల కోర్సు, డిప్లొమా, ఐటిఐ, పాలిటెక్నిక్, ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్ పూర్తి చేసిన వారు కూడా అర్హులేనని పేర్కొన్నారు. పూర్తి సమాచారం, ఆన్ లైన్ లో నమోదు తదితర అంశాలపై సందేహాలుంటే సమీపంలోని అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని లేదా విశ్వవిద్యాలయ హెల్ప్ డెస్క్ నంబర్లు: 040 23680333 / 555 లలో లేదా టోల్‌ఫ్రీ నెం. 18005990101 లో సంప్రదించొచ్చని సూచించారు. అడ్మిషన్ ఫీజును నెట్ బ్యాంకింగ్/క్రెడిట్/డెబిట్ కార్డ్ లేదా టీఎస్ ఆన్ లైన్ ద్వారా చెల్లించొచ్చు అని వివరించారు. ట్యూషన్ ఫీజు చెల్లించడానికి చివరి తేది ఆగష్టు 7, 2026 అని పేర్కొన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ ప్రొ. జి.పుష్ప చక్రపాణి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయ కృష్ణ రెడ్డి, విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డాక్టర్ వై.వెంకటేశ్వర్లు, వీసీ OSD ప్రొ. రవీంద్ర నాథ్ సోలమన్, ఎస్‌డీ అండ్ వీటీసీ డైరెక్టర్ ప్రొ. పల్లవి కాబ్డే తదితరులు పాల్గొన్నారు.

# రియల్ ఎస్టేట్‌పై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

**హైదరాబాద్, జూలై 25 :**

రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని కొంతమంది ఉద్దేశపూర్వకంగా గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని, దీనిలో ఏమాత్రం నిజం లేదని రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ మంత్రిగా స్పష్టమైన ఆధారాలు, వివరాలు ఉన్నాయని, అందువల్ల అలాంటి ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదని అన్నారు. నగరంలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రెండున్నరేళ్ల ప్రజా ప్రభుత్వ పాలనలో సుమారు 15 నుంచి 20 శాతం రియల్ ఎస్టేట్ అభివృద్ధి జరిగిందని, 40 శాతం వరకు ఫ్లాట్ల విక్రయాలు వృద్ధిచెందాయని చెప్పారు. గతన పదేళ్లతో పోలిస్తే ఈ రెండున్నరేళ్లలో రెసిడెన్షియల్ మార్కెట్ విశేషంగా పెరిగిందని, దీనికి సంబంధించి తమ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో పెరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్యే నిదర్శనమని చెప్పారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఏపీలో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రుల చొరవ కారణంగానే హైదరాబాద్ ఒక రోల్ మోడల్‌గా రూపొందిందని, వారి దూరదృష్టి వల్లే ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటి సెక్టార్ తదితరాలు 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చెందాయని వివరించారు. అందువల్లే హైదరాబాద్ ఇప్పుడు దేశంలోనేగాక ప్రపంచంలోనే అందరి దృష్టినీ ఆకర్షిస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి దావోస్ వెళ్లినపుడు అక్కడ కూడా అధికశాతం పారిశ్రామికవేత్తలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపారని చెప్పారు. హైదరాబాద్ నగరం పెట్టుబడులకు గమ్యస్థానం అవుతుందన్నారు. 'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టితో ప్రణాళికాబద్ధంగా హైదరాబాద్ నగరాభివృద్ధికి చర్యలు చేపట్టారు.. రూ.7వేల కోట్లతో చేపడుతున్న మూసీ ప్రాజెక్టు సుందరీకరణ పట్టాలెక్కనుంది' అని మంత్రి పొంగులేటి తెలిపారు. 28 కి.మీ తొలి విడత అభివృద్ధికి వారం పది రోజుల్లో టెండర్లు పిలవబోతున్నామని చెప్పారు. అలాగే పాత బస్తీ తదితరాలను కలుపుతూ రెండో విడతగా 76 కి.మీ మేర రూ.24వేల కోట్ల ఖర్చుతో మెట్రో విస్తరణ కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. ఇవేగాక ట్రిబుల్ ఆర్ నుంచి ఓఆర్ఆర్ కలుపుతూ రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిపారు.



ప్రపంచంలోనే సుందర నగరమైన హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం పక్షాన కూడా మరింత అభివృద్ధి చెందడానికి రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధుల సహకారం అవసరమని, ప్రజలకు నమ్మకంగా, సకాలంలో ఫ్లాట్లను అందించి వారి అభిమానాన్ని చూరగొనాలని మంత్రి హితవు పలికారు. రాష్ట్రంలో భూముల భద్రత, భరోసా కల్పించేందుకు భూభారతి చట్టాన్ని తెచ్చామని, వీటిలో కొన్ని చిన్న చిన్న సమస్యలను సాఫ్ట్‌వేర్‌పరంగా 1520 రోజుల్లో సరిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. కేవలం రియల్ ఎస్టేట్ రంగం కోసమే గాక పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు క్యూర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు నిర్ణయించామని, దీని తర్వాత దఫదఫాలుగా ఇళ్ల మంజూరు ఉంటుందని మంత్రి చెప్పారు. ప్రజలకు ఇళ్ల నిర్మాణానికి 23 లక్షల చదరపు అడుగుల స్థల సేకరణకు ప్రయత్నిస్తున్నామని చెబుతూ రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధుల కోరిక మేరకు ఫాస్ట్ ట్రాక్ సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 15 వరకు లక్ష ఇంకుడు గుంతలు పూర్తి చేయాలి

**హైదరాబాద్, జూలై 25:**

రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ఆగస్టు 15వ తేదీలోపు పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ఈ లక్ష్యాన్ని అత్యుత్తమంగా సాధించిన అధికారులు, గ్రామ పంచాయతీలు, ప్రజాప్రతినిధులను ముఖ్యమంత్రి చేతుల మీదుగా సన్మానిస్తామని తెలిపారు. ఇది కేవలం లక్ష్య సాధన కాదని, రాష్ట్ర భవిష్యత్ జల సంరక్షణకు బలమైన పునాది వేయడమేనని పేర్కొన్నారు. సచివాలయం నుంచి స్పెషల్ సీఎస్ దానకిషోర్, కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మిలతో కలిసి మంత్రి సీతక్క జిల్లా అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు), జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులు, సీఈవోలు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీబీ జీ రాం జీ అమలు, జలసిరి పనులు, జీపీఎస్‌ఏపీ రూపకల్పనపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు 7వ తేదీ నుంచి జిల్లాల వారీగా స్వయంగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తానన్నారు. ప్రతి జిల్లాలో పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా అధికారులను బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రతి సోమ, మంగళ, బుధవారాల్లో తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించి, వీబీ జీ రాంజీ పరిధిలో ఉన్న 318 రకాల పనులను గ్రామాల అవసరాలకు అనుగుణంగా గుర్తించి వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. గ్రామసభలే అభివృద్ధి కార్యాచరణకు కేంద్ర బిందువుగా ఉండాలని అన్నారు. తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని మంత్రి సీతక్క అధికారులకు సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించే ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊటకుంటు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాల వంటి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండలస్థాయిలో పనుల అమలు, పురోగతిపై నిరంతర పర్యవేక్షణ కోసం మిషన్ భగీరథ ఏఈ, పంచాయతీరాజ్ ఏఈ, ఎంపీడీఓ, ఏపీఓ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలితో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. ఈ కమిటీ ప్రతి పనిని క్రమం తప్పకుండా సమీక్షిస్తూ లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీబీ జీ రాం జీ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో మరింత వేగవంతంగా అమలు చేయాలని, జలసిరి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సీతక్క ఆదేశించారు. గ్రామాల అభివృద్ధికి సమగ్ర కార్యాచరణగా గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికను శాస్త్రీయంగా రూపొందించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పించడం అత్యంత ప్రాధాన్యమన్నారు.




ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో అధికారులు పని చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెంచడంతోపాటు నీటి సంరక్షణ పనులను పెద్దఎత్తున చేపట్టాలని సూచించారు. జలసిరి కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో ప్రజా భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పంటకు ఫార్మ్ పాండ్, ప్రతి ఊరికి ఊట కుంట, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలను లక్ష్యంగా పెట్టుకుని పనులను వేగంగా ప్రారంభించాలని ఆదేశించారు. వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చే ఈ కార్యక్రమం భవిష్యత్ నీటి భద్రతకు కీలకమన్నారు. గ్రామాల అవసరాలు, అందుబాటులో ఉన్న వనరులు, భవిష్యత్ అభివృద్ధి అవసరాలను దృష్టిలో పెట్టుకుని పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక జీపీఎస్‌ఏపీను రూపొందించాలని మంత్రి సూచించారు.త్వరలో హ్యామ్ రహదారుల పనులు పట్టణ ప్రాంత రోడ్లకు ఏమాత్రం తీసిపోని రీతిలో గ్రామీణ రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. అందుకోసమే అత్యంత ఆధునికమైన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) విధానాన్ని అవలంబిస్తున్నామని చెప్పారు. సచివాలయంలో శనివారం పంచాయతీ రాజ్ శాఖ స్పెషల్ సీఎస్ దానకిషోర్, ఈఎన్సీ జోగారెడ్డి, సీఈలతో కలిసి గ్రామీణ హ్యామ్ రోడ్ల నిర్మాణ పురోగతిపై మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడూ పంచాయతీ రాజ్ శాఖ ద్వారా హ్యామ్ మోడల్‌లో మొత్తంగా 6,703 గ్రామాల్లో 18,472 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపడుతోంది. అందులో మొదటి విడత కింద 2,678 గ్రామాల్లో 7,450 కిలోమీటర్ల మేర రోడ్ల విస్తరణ, పునర్నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు.మొదటి విడుతలో 90 శాతం పనులు ప్రస్తుతం ఉన్న రహదారుల ఆదునీకరణ పనులకే ప్రధాన్యమిస్తున్నామని వెల్లడించారు. దశాబ్దాలుగా రవాణా సౌకర్యం లేని 179 గ్రామాలకు తొలిసారిగా 934 కిలోమీటర్ల మేర బిటి, సిసి రోడ్లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న హ్యామ్ విధానాన్ని దేశమంతా ఆసక్తిగా పరిశీలిస్తున్నందున మార్గదర్శకాలను అత్యంత సమగ్రంగా రూపొందించామని మంత్రి స్పష్టం చేశారు. ఆర్బీఐ అనుమతుల వచ్చే వారంలోగా పూర్తి స్థాయిలో రానున్నాయని, ఆగస్టు 15 నాటికి కాంట్రాక్ట్ అగ్రిమెంట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అగ్రిమెంట్లు కాగానే కాంట్రాక్టర్లు వెంటనే పనులు ప్రారంభించాలని, టెండర్లు దక్కించుకోవడంలో చూపిన ఉత్సాహం పనులు పూర్తి చేయడంలోనూ చూపాలని స్పష్టం చేశారు. పనులను సొంత బాధ్యతగా స్వీకరించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. గతంలో సింగిల్ రోడ్డు ఉన్న చోట కూడా ఇప్పుడు భారీ వాహనాలు వెళ్లేలా నాణ్యతతో రోడ్లను నిర్మించాలని తెలిపారు. పనుల్లో ఆలస్యం లేకుండా భూసమీకరణ, చెట్ల తొలగింపు వంటి అంశాలపై జిల్లా కలెక్టర్లకు తక్షణమే సర్క్యులర్ జారీ చేయాలన్నారు. సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇప్పించాలని, అటవీ భూములు ఉన్న ప్రాంతాల్లో క్షేత్రస్థాయి సమస్యలను స్థానిక అధికారుల సహాయంతో పరిష్కరించుకోవాలని సూచించారు. నిర్మాణంలో ఏవైనా సమస్యలు ఎదురైతే నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని కాంట్రాక్టర్లకు మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు

# రూ.547 కోట్లు కాదు..రూ.1,000 కోట్లు!

**మొదటిపేజీ తరువాయి**

దర్యాప్తు ముందుకు సాగే కొద్దీ రూ.1,000 కోట్లకు పైగా అక్రమ ఆర్థిక లావాదేవీలతో కూడిన దేశ వ్యాప్త సైబర్ నెట్‌వర్క్‌గా మారే అవకాశాలు కనిపించడంతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీసీఎస్బీ) ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను రంగంలోకి దించింది. డీఎస్పీ కె.వి.మురళీధర ప్రసాద్ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందానికి విచారణ బాధ్యతలు అప్పగించారు. పలు రాష్ట్రాలకు విస్తరించిన నిధుల బదిలీలు, బ్యాంకు ఖాతాల వినియోగం, అంతర్జాతీయ లింకులు, మాస్టర్ మైండ్ల పాత్రపై సిట్ లోతైన దర్యాప్తు ప్రారంభించింది. ఈ కేసు రాష్ట్రంలో ఇప్పటివరకు వెలుగులోకి వచ్చిన అతిపెద్ద సైబర్ ఆర్థిక నేరాల్లో ఒకటిగా అధికారులు భావిస్తున్నారు. సైబర్ మోసాల ద్వారా దేశవ్యాప్తంగా వసూలైన డబ్బును అమాయకుల పేర్లతో తెరిచిన బ్యాంకు ఖాతాల ద్వారా మళ్లించి, అక్రమ నిధులను చట్టబద్ధమైన లావాదేవీలుగా మార్చే వ్యవస్థను నిందితులు ఏర్పాటు చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. ప్రతి వారం దర్యాప్తు పురోగతి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

సత్తుపల్లి ప్రాంతానికి చెందిన ఓ యువకుడికి ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి అతని పేరుతో బ్యాంకు ఖాతాలు తెరిపించినట్లు నమోదైన ఫిర్యాదుతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అనంతరం ఆ ఖాతాల ద్వారా భారీ స్థాయిలో అను మానాస్పద లావాదేవీలు జరిగినట్లు గుర్తించిన పోలీసులు విచారణ ప్రారంభించారు. ఇదే సమయంలో ఖమ్మంలోని వీఎం బంజారా పోలీస్ స్టేషన్లో నమోదైన మరో కేసులో కూడా ఇలాంటి తరహా లావాదేవీలు బయటపడటంతో రెండు కేసులను అనుసంధానం చేసి ఖమ్మం సీపీ సునీల్ దత్ ఆదేశాలతో కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టిన విషయం తెలిసిందే. దర్యాప్తులో నిందితులు నిరుద్యోగ యువకులు, రోజు వారీ కూలీలు, చిన్న వ్యాపారులు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారిని లక్ష్యంగా చేసుకున్నట్లు గుర్తించారు. ఉద్యోగాలు, కమిషన్లు, వ్యాపార అవ కాశాల పేరుతో వారి పేర్లపై బ్యాంకు ఖాతాలు తెరిపించి, ఏటీఎం కార్డులు, చెక్ బుక్ లు , ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. తర్వాత దేశవ్యాప్తంగా జరిగిన వివిధ సైబర్ మోసాల ద్వారా బాధితుల నుంచి వసూలైన డబ్బును ఈ ఖాతాల ద్వారా మరో ఖాతాలకు మళ్లించారు. ఇలాంటి మ్యూల్ అకౌంట్లు వందల సంఖ్యలో వినియోగించినట్లు తేలింది.



**అనేక రకాల సైబర్ నేరాల అనుసంధానం**

కొద్ది నెలల కిందట సత్తుపల్లి కేంద్రంగా 60 మందికి పైగా అరెస్ట్ అయ్యారు. వీరిని జైలుకు పంపిన ఆ తర్వాత బెయిల్ పై వచ్చి దర్జాగా తిరుగుతుండడంతో సత్తుపల్లి , కల్లూరు ప్రాంత యువకులు అదే దారి పడుతున్నారు. ఈ నెట్‌వర్క్ కు స్టాక్ మార్కెట్ పెట్టుబడి మోసాలు, క్రిప్టో పెట్టుబడి పేరుతో మోసాలు, ఆన్లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్లు, ఓటీపీ మోసాలు, మ్యాట్రిమోనీ మోసాలు, నకిలీ పెట్టుబడి పథకాలు వంటి పలు రకాల సైబర్ నేరాలతో సంబంధాలు ఉండొచ్చనే అనుమానంతో సిట్ కు కేటాయించారు. ఈ మోసాల ద్వారా వచ్చిన నిధులను మ్యూల్ ఖాతాల ద్వారా పలు బ్యాంకులకు బదిలీ చేసినట్లు అధికారు లు అప్పట్లో గుర్తించారు. నిధుల ప్రవాహం ఎక్కడి నుంచి ప్రారంభమైంది. చివరకు ఎవరి ఖాతాలకు చేరింది, విదేశీ సర్వర్లు లేదా క్రిప్టో వాలెట్ల వినియోగం ఉందా. అనే కోణంలో కూడా సిట్ అధికారులు విచారణ చేయనున్నారు. దేశ వ్యాప్తంగా పనిచేస్తున్న ఇతర సైబర్ నేర ముఠాలతో ఈ నెట్‌వర్క్ కు సంబంధాలు ఉన్నాయా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. ఇప్పటికే పలువురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు ప్రకటించగా, మరికొందరి కోసం గాలింపు కొనసాగుతోంది. ప్రధాన నిందితుడు పోట్రు ప్రవీణ్ బిఆర్ఎస్ యువ నేతగా ఉన్నారు. సైబర్ మోసాల ద్వారా కొల్లగొట్టిన సొమ్మును తన వ్యక్తి గత రాజకీయ పలుకుబడి కోసం వినియోగించారు. వందలు అడిగిన వారికి వేల రూపాయలు అందజేశాడు. ప్రభుత్వం మారగానే ఆయన గుట్టు బయటపడింది. ఈ కేసులో ఇతర నిందితులు పోత్రు కళ్యాణ్, మోరంపూడి చెన్నకేశవ రావు జన్జునూరి శివకృష్ణ, ఉడుతనేని వికాస్ ఉన్నారు. ప్రస్తుత అధికార పార్టీకి చెందిన ఓ మంత్రి స్థాయి అనుచరులుగా ఇందులో కొందరికి ముద్ర ఉండడంతో వారిని ఆఖరున అరెస్ట్ చేశారు. రూ.547 కోట్ల అక్రమ లావాదేవీలు ఉన్నట్లు స్థానిక పోలీసులు తేల్చారు. ప్రస్తుతం ఈ కేసులో విదేశీ లింకులు రూ.547 కోట్ల నుంచి రూ.1,000 కోట్లకు పైగా అక్రమ ఆర్థిక లావాదేవీల ఉండడం, పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆ కేసులను సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు బదిలీ చేశారు. ఇప్పటికే ఖమ్మం జిల్లాలో నమోదైన రెండు కేసుల ఆధారంగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో కొత్తగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. వి.ఎం. బంజారా పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుతో పాటు సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన మరో కేసును సైబర్ సెక్యూరిటీ బ్యూరో స్వాధీనం చేసుకుంది. ఈ వ్యవహారంలో సాంకేతిక ఆధారాలు, బ్యాంకు లావాదేవీలు, మనీలాండరింగ్ కోణాలపై లోతైన విచారణ చేపట్టనున్నారు. బ్యాంకు లావాదేవీల డిజిటల్ ట్రైల్ ఆధారంగా కీలక సూత్రధారులను గుర్తించే పనిలో దర్యాప్తు సంస్థలు నిమగ్నమయ్యాయి.

# ఇందిరమ్మ టవర్స్‌పై కాల్ సెంటర్

**హైదరాబాద్, జూలై 25 :**

హైదరాబాద్ మహా నగరంలోని పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు నగర నడిబొడ్డున సొంతింటిని అందించాలనే సంకల్పాన్ని కార్యరూపంలోకి తీసుకొస్తూ ప్రజా ప్రభుత్వం క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ పథకంపై

ప్రజల్లో ఎలాంటి గందరగోళం, అపోహలు లేకుండా దరఖాస్తు విధానం, అర్హతలు, అవసరమైన పత్రాలు, చెల్లింపులు, కేటాయింపు విధానం తదితర అంశాలపై పూర్తి సమాచారం అందించేందుకు ప్రత్యేక కాల్ సెంటర్ హెల్ప్‌లైన్‌ను హౌసింగ్ బోర్డు కార్యాలయంలో మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి సందేహాలు ఉన్నా మధ్యవర్తులను నమ్మకుండా నేరుగా 04024603572 నంబర్‌కు ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల మధ్య ఫోన్ చేసి అధికారిక సమాచారాన్ని తెలుసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారుల సౌకర్యార్థం తెలుగు, హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషలలో సమాచారం తెలియజేయస్తామన్నారు. క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో 7680 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని, ఏ నియోజకవర్గానికి చెందిన ప్రజలు అదే నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. దరఖాస్తు దారులు ఎలాంటి విష ప్రచారాలను నమ్మకూడదని, మీసేవ కేంద్రాలు, ఆన్‌లైన్ పోర్టల్, వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. హైదరాబాద్ క్యూర్ ఏరియాలో నివసిస్తున్న అల్పాదాయ వర్గాల కుటుంబాల కోసం ఈ పథకాన్ని రూపొందించామని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షల వరకు ఉండాలని తెలిపారు. ఒక కుటుంబం నుంచి ఒక దరఖాస్తు మాత్రమే స్వీకరించనున్నట్లు, అర్హత కలిగిన కుటుంబానికి ఒక ఫ్లాట్ మాత్రమే కేటాయిస్తామని స్పష్టం చేశారు. అందిన దరఖాస్తులను డిజిటల్ విధానంలో పరిశీలించడంతోపాటు, క్షేత్రస్థాయి పరిశీలన, సమగ్ర ధ్రువీకరణ నిర్వహిస్తామన్నారు. నిర్మిస్తున్న ఫ్లాట్ల సంఖ్య కంటే అర్హులైన సంఖ్య ఎక్కువగా ఉంటే లాటరీ ద్వారా ఇండ్లను కేటాయిస్తామన్నారు. దరఖాస్తుదారు క్యూర్ పరిధిలో పదేళ్లుగా నివాసం ఉండాలని, దరఖాస్తుదారు లేదా కుటుంబానికి ఓఆరఆర్, క్యూర్ పరిధిలో సొంత ఇల్లు లేదా ఫ్లాట్ లేదా ప్లాట్ ఉండకూడదని తెలిపారు. దరఖాస్తు సమయంలో ఆధార్ నెంబర్ తెలియజేస్తే సరిపోతుందని, కుల, జీతభత్యాల ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదని, లాటరీ సమయంలో వీటిని సమర్పించవచ్చునని తెలిపారు. దరఖాస్తు సమయంలో రూ.10 వేల చెల్లింపునకు యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్‌ను మాత్రమే ఉపయోగించాలని, ఒకవేళ ఇల్లు మంజూరు కాకపోతే తిరిగి అదే ఖాతాకు ఆ మొత్తం వాపసు అవుతుందని పొంగులేటి చెప్పారు. పరిశీలన, కేటాయింపు, వాపసు తదితర సమాచారం పూర్తయ్యేవరకు మీసేవ రశీదు, చెల్లింపు రశీదు, దరఖాస్తు సంఖ్య, మొబైల్ నెంబర్‌లను యాక్టివ్‌గా ఉంచుకోవాలని సూచించారు. ఒక్కో ఫ్లాట్ ఖరీదు రూ.40 నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుందని, ఇందులో ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీతో పాటు అన్‌డివైడెడ్ షేర్ కింద 20 నుంచి 25 గజాల స్థలాన్ని కూడా లబ్దిదారుని పేరిట రిజిస్ట్రేషన్ చేస్తుందని తెలిపారు. లబ్దిదారుడు కేవలం రూ.6 లక్షలు మాత్రమే చెల్లించవలసి ఉంటుందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, హౌసింగ్ బోర్డు సీఈ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా చుట్టూ వివాదాల వలయం

- **హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు.. ఆర్మీ నుంచి సహకార అభ్యర్థన**
- **కోర్టు ఆదేశాల అమలుపై హైడ్రాకు హైకోర్టు తీవ్ర హెచ్చరిక**
- **కమిషనర్ రంగనాథ్ తీరుపై న్యాయస్థానం ఆగ్రహం**
- **రక్షణ శాఖ భూముల పరిరక్షణకు హైడ్రా సాయం కోరిన ఆర్మీ**
- **చట్టబద్ధత, పారదర్శకతతోనే విశ్వసనీయత సాధ్యమనే అభిప్రాయం**

**హైదరాబాద్, జూలై 25:**

హైదరాబాద్‌లో ఆక్రమణల తొలగింపు, చెరువుల పరిరక్షణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రా ప్రస్తుతం తీవ్ర న్యాయపరమైన, పరిపాలనాపరమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. ఆక్రమణలపై కఠిన చర్యలతో గుర్తింపు పొందిన ఈ వ్యవస్థ ఒకవైపు తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహానికి గురవుతుండగా, మరోవైపు రక్షణ శాఖ భూముల పరిరక్షణ కోసం ఆర్మీ అధికారులు హైడ్రా సహకారం కోరడం చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామాలు హైడ్రా పనితీరుపై భిన్న అభిప్రాయాలకు దారితీస్తున్నాయి.

**కోర్టు ఆదేశాల అమలుపై తీవ్ర అభ్యంతరం**

లోతుకుంట భూముల వివాదం విచారణ సందర్భంగా హైడ్రా తీరుపై తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా చర్యలు చేపట్టడం, రెవెన్యూ, నీటిపారుదల చట్టాలను పక్కనబెట్టి వ్యవహరించడం సమంజసం కాదని స్పష్టం చేసింది. కోర్టు ధిక్కరణ ఉత్తర్వులను ఉల్లంఘించడం అత్యంత తీవ్రమైన అంశమని పేర్కొంటూ చట్టబద్ధమైన విధానాలను తప్పనిసరిగా అనుసరించాలని హైడ్రాకు సూచించింది.

**కమిషనర్ తీరుపై ఆగ్రహం**

హైడ్రా కమిషనర్ రంగనాథ్, అధికారులు కోర్టు ఆదేశాలు అమల్లో ఉన్నప్పటికీ నోటీసులు ఇవ్వకుండా లేదా సహజ న్యాయ సూత్రాలను పూర్తిగా పాటించకుండా చర్యలు తీసుకుంటున్నారనే ఆరోపణలు విచారణలో ప్రస్తావనకు వచ్చాయి. ఈ వ్యవహారంపై కమిషనర్ స్వయంగా క్షమాపణలు తెలుపుతూ అఫిడవిట్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించడం ప్రాధాన్యత సంతరించుకుంది. చట్టాన్ని అతిక్రమించే ఎలాంటి చర్యలనైనా ఉపేక్షించబోమని న్యాయస్థానం స్పష్టం చేసింది.

**ఆర్మీ నుంచి సహకార అభ్యర్థన**


ఇదే సమయంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని రక్షణ శాఖ భూముల ఆక్రమణల సమస్యపై ఆర్మీ అధికారులు హైడ్రా కమిషనర్‌ను కలిసి సహకారం కోరినట్లు సమాచారం. రక్షణ శాఖకు చెందిన భూములను ఆక్రమణల నుంచి విముక్తి చేయడంలో సహాయం అందించాలని వారు కోరారు. ఆక్రమణల నిరోధంలో హైడ్రా సామర్థ్యంపై ప్రభుత్వంలోని ఇతర వ్యవస్థలు విశ్వాసం వ్యక్తం చేస్తున్న సంకేతంగా ఈ పరిణామాన్ని విశ్లేషిస్తున్నారు.

**రెండు కోణాల్లో హైడ్రా**

ఒకవైపు న్యాయస్థానం చట్టపరమైన ప్రక్రియల అమలుపై ప్రశ్నలు లేవనెత్తుతుండగా, మరోవైపు ప్రభుత్వ సంస్థలు ఆక్రమణల తొలగింపులో హైడ్రా సహకారం కోరడం ఈ వ్యవస్థ ఎదుర్కొంటున్న ద్వంద్వ పరిస్థితిని ప్రతిబింబిస్తోంది. ఆక్రమణలపై కఠిన చర్యలు కొనసాగించడమే కాకుండా ప్రతి చర్యలో చట్టబద్ధత, పారదర్శకత పాటించడం అవసరమనే అభిప్రాయం బలపడుతోంది.

**ముందున్న సవాల్**

ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో హైడ్రా తన చర్యలను పూర్తిగా చట్టపరమైన విధానాల ప్రకారం కొనసాగించాల్సిన అవసరం ఉంది. ముందస్తు నోటీసులు, సంబంధిత శాఖల సమన్వయం, న్యాయస్థానాల ఆదేశాలకు పూర్తి గౌరవం ఇస్తూ వ్యవహరిస్తేనే ఈ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడుతుంది. లేకపోతే ఆక్రమణల నియంత్రణలో సాధించిన గుర్తింపు న్యాయపరమైన వివాదాల కారణంగా దెబ్బతినే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
ఆదివారం
26 జూలై 2026

## సంపాదకీయం



# ఇది ఆరంభమే..

36 ఆరు రోజుల పాటు ఢిల్లీలోని జంతర్ మంతర్ ఒక కొత్త చరిత్రకు వేదికైంది. వేలాది మంది విద్యార్థులు, యువత, ఉద్యోగార్థులు, తల్లిదండ్రులు ఒకే లక్ష్యంతో అక్కడ నిలబడ్డారు. మొదట కొందరు దీనిని సోషల్ మీడియా హడావుడిగా చూశారు. మరికొందరు రెండు మూడు రోజుల్లో ఉద్యమం చల్లారిపోతుందని భావించారు. కానీ రోజులు గడిచేకొద్దీ ఉద్యమం బలపడింది. దేశవ్యాప్తంగా మద్దతు పెరిగింది. చివరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. రాష్ట్రపతి ఆ రాజీనామాను ఆమోదించగా, ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇది రాజకీయంగా పెద్ద పరిణామమే అయినప్పటికీ, విద్యార్థుల పోరాటం దృష్టిలో చూస్తే ఇది అంతిమ విజయం కాదు... నైతిక విజయం మాత్రమే.

ప్రజాస్వామ్యంలో ఒక మంత్రి రాజీనామా చేయడం అంటే కేవలం ఒక వ్యక్తి పదవి కోల్పోవడం కాదు. ప్రభుత్వాలు కూడా ప్రజల ఒత్తిడికి జవాబుదారులేనని గుర్తు చేసే సంకేతం. ముఖ్యంగా పోటీ పరీక్షలు, పేపర్ లీకులు, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు వంటి అంశాలపై నెల రోజులకుపైగా కొనసాగిన ఉద్యమం తర్వాత ఈ నిర్ణయం రావడం ప్రజాస్వామ్య చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలుస్తుంది. కానీ ఇక్కడే ఉద్యమం ముగిసిందని భావిస్తే అదే అతిపెద్ద పొరపాటు అవుతుంది. విద్యార్థులు ఒక వ్యక్తికి వ్యతిరేకంగా మాత్రమే పోరాడలేదు. ఒక వ్యవస్థ వైఫల్యానికి వ్యతిరేకంగా పోరాడారు. నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కావడం, పరీక్షలపై నమ్మకం దెబ్బతినడం, కోచింగ్ మాఫియా ప్రభావం, పరీక్ష నిర్వహణలో లోపాలు, పారదర్శకతపై అనుమానాలు.. ఇవన్నీ కలిసి ఈ ఉద్యమానికి కారణమయ్యాయి.

ఈ ఉద్యమం మరో గొప్ప పాఠం కూడా నేర్పింది. ఐక్యంగా నిలబడితే యువత అసాధ్యాన్ని కూడా సాధించగలదని. సాధారణంగా విద్యార్థి ఉద్యమాలు ప్రాంతాల వారీగా, విశ్వవిద్యాలయాల వారీగా, రాజకీయ విభజనల మధ్య బలహీనపడతాయి. కానీ ఈసారి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన యువత ఒకే డిమాండ్ చుట్టూ ఏకమైంది. అదే ఉద్యమానికి బలం ఇచ్చింది. అదే ప్రభుత్వాన్ని చర్చల బల్లపైకి తీసుకొచ్చింది. అదే చివరకు రాజకీయ నిర్ణయానికీ దారితీసింది. అయితే చరిత్ర ఒక విషయాన్ని పదేపదే చెబుతోంది. ప్రజా ఉద్యమాలు తమ మొదటి విజయాన్నే అంతిమ విజయంగా భావించినప్పుడు సంస్కరణలు మధ్యలోనే ఆగిపోతాయి. 2011లో అన్నా హజారే ఉద్యమం తర్వాత కూడా అవినీతి పూర్తిగా అంతరించిపోలేదు. రైతుల ఉద్యమం తర్వాత కూడా వ్యవసాయ సమస్యలన్నీ పరిష్కారం కాలేదు. అలాగే ఇప్పుడు ఒక మంత్రి రాజీనామా చేశారని విద్యా వ్యవస్థ ఒక్కరోజులో పవిత్రం కాబోదు. వ్యక్తులు మారడం కంటే వ్యవస్థ మారడం చాలా కష్టం. అదే అసలు పోరాటం.

ప్రభుత్వం ఇప్పటికే కొన్ని సంస్కరణలు ప్రకటించింది. పరీక్షల నిర్వహణలో మార్పులు, కంప్యూటర్ ఆధారిత పరీక్షల విస్తరణ, విచారణలు, కఠిన చర్యల హామీలు ఇచ్చింది. కానీ హామీలకంటే అమలు ముఖ్యం. ప్రతి పరీక్ష కేంద్రంలో భద్రత ఎలా ఉంటుంది? ప్రశ్నాపత్రాలు ఎలా రక్షించబడతాయి? డిజిటల్ భద్రత ఎలా పెరుగుతుంది? పరీక్షల నిర్వహణ సంస్థలపై స్వతంత్ర పర్యవేక్షణ ఉంటుందా? పేపర్ లీక్‌కు పాల్పడిన వారిపై విచారణ ఎంత వేగంగా పూర్తవుతుంది? ఇవే ఇప్పుడు విద్యార్థులు అడగాల్సిన ప్రశ్నలు. దేశంలో పోటీ పరీక్షలు కోట్లాది కుటుంబాల జీవితాలతో ముడిపడి ఉన్నాయి. ఒక పరీక్ష ఫలితం ఒక ఇంటి ఆర్థిక పరిస్థితిని మార్చగలదు. ఒక ప్రభుత్వ ఉద్యోగం ఒక కుటుంబాన్ని పేదరికం నుంచి బయటపడేయగలదు. ఒక వైద్య విద్యా సీటు కోసం విద్యార్థులు సంవత్సరాల పాటు శ్రమిస్తారు. అలాంటి పరీక్షల్లో ఒక్క లీక్ కూడా లక్షలాది జీవితాలపై ప్రభావం చూపుతుంది. కాబట్టి పరీక్షల నిర్వహణను ఎన్నికల నిర్వహణంత పవిత్రంగా, సాంకేతికంగా, పారదర్శకంగా మార్చాల్సిన అవసరం ఉంది.

ఈ ఉద్యమం ప్రభుత్వం మాత్రమే కాదు, సమాజానికీ ఒక సందేశం ఇచ్చింది. గతంలో విద్యార్థులను "ఇవాళ చదువు... రేపు మాట్లాడి చూడు" అని చూసే ధోరణి ఉండేది. కానీ ఈ తరం మరో విషయం నిరూపించింది. చదువుకునే విద్యార్థి కూడా రాజ్యాంగబద్ధంగా ప్రశ్నించగలడు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం అల్లరి కాదు. శాంతియుతంగా జవాబుదారీతనం కోరడం హక్కు. అయితే ఉద్యమాలకు కూడా ఒక బాధ్యత ఉంటుంది. ప్రజాస్వామ్యంలో నిరసనలు ఎంత ముఖ్యమో, సంస్కరణల అమలును పర్యవేక్షించడం కూడా అంతే ముఖ్యం. ఇప్పుడు జంతర్ మంతర్ ఖాళీ అయిందని పోరాటం ముగిసినట్లయితే, కొద్ది నెలల తర్వాత మరో పరీక్ష, మరో లీక్, మరో ఆందోళన తిరిగి రావచ్చు. అందుకే ఈ ఉద్యమం వీధుల నుంచి సంస్థాగత పర్యవేక్షణ దిశగా మారాలి. విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలు, న్యాయ నిపుణులు, తల్లిదండ్రుల సంఘాలు కలిసి ప్రభుత్వ హామీల అమలును నిరంతరం గమనించాలి.

ప్రతి పరీక్ష తర్వాత సమీక్ష ఉండాలి. ప్రతి లోపంపై ప్రజలకు నివేదిక ఇవ్వాలి. ప్రశ్నాపత్రాల భద్రతపై స్వతంత్ర ఆడిట్ జరగాలి. పరీక్ష నిర్వహణ సంస్థలు పార్లమెంట్, ప్రజల ముందు జవాబుదారీగా ఉండాలి. పేపర్ లీక్‌ను దేశద్రోహం అన్నంత తీవ్రమైన నేరంగా పరిగణించాలా? ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేయాలా? ఆస్తుల స్వాధీనం వంటి కఠిన శిక్షలు అవసరమా? అనే అంశాలపై కూడా జాతీయ స్థాయిలో చర్చ జరగాలి. ధర్మేంద్ర ప్రధాన్ తన రాజీనామా లేఖలో విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నానని పేర్కొన్నారు. ఆ నిర్ణయం వ్యక్తిగతంగా ఎంత ప్రాముఖ్యమైనదైనా, చరిత్ర దానిని ఎలా గుర్తుంచుకుంటుందో ఇప్పుడు ప్రభుత్వ తదుపరి చర్యలే నిర్ణయిస్తాయి. కొత్త మంత్రి బాధ్యతలు చేపట్టడం సరిపోదు. కొత్త ఆలోచన, కొత్త వ్యవస్థ, కొత్త నమ్మకం కూడా రావాలి. ఈ ఉద్యమంలో గెలిచింది ఒక పార్టీ కాదు. ఓడిపోయింది కూడా ఒక వ్యక్తి మాత్రమే కాదు. గెలిచింది ప్రజాస్వామ్యంలో శాంతియుత ఐక్యత. ఒక తరం "మా భవిష్యత్తు మా చేతుల్లోనే ఉంటుంది" అని చెప్పిన ధైర్యం. అదే ఈ ఉద్యమం యొక్క అసలు విజయం. కానీ ఆ విజయాన్ని శాశ్వతంగా నిలబెట్టాలంటే విద్యార్థులు ఇప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలి. ఒక మంత్రి రాజీనామాతో సంతృప్తి చెందితే చరిత్ర మళ్లీ పునరావృతమవుతుంది. వ్యవస్థ పూర్తిగా మారే వరకు, పేపర్ లీక్ అనే పదమే చరిత్ర పుస్తకాల్లోకి వెళ్లే వరకు, ప్రతి పరీక్షపై ప్రతి విద్యార్థికి సంపూర్ణ విశ్వాసం కలిగే వరకు, ఈ పోరాట స్ఫూర్తి కొనసాగాలి.

# ప్రధాన్.. రిజైన్

- తలొగ్గిన మోదీ సర్కార్.. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా
- రాష్ట్రపతి ఆమోదం.. ప్రహ్లాద్ జోషికి అదనపు బాధ్యతలు
- ఆందోళనలు విరమించిన కాక్రోచ్ జనతా పార్టీ

**న్యూఢిల్లీ (దీక్ష):** నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో దేశవ్యాప్తంగా రగులుకున్న ఆందోళనలకు కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు తలొగ్గింది. విద్యార్థులు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసనల ధాటికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు శనివారం ఆయన తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోదీకి పంపారు. మంత్రి రాజీనామాతో పాటు పలు కీలక డిమాండ్లకు కేంద్రం అంగీకరించడంతో నెల రోజులుగా జంతర్ మంతర్ వేదికగా జరుగుతున్న ఆందోళనను విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది. తన రాజీనామా విషయాన్ని ధర్మేంద్ర ప్రధాన్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. దేశ యువత ఆకాంక్షలను నెరవేర్చడంతో పాటు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేసినట్లు ఆయన పేర్కొన్నారు. 2026 మే 3 న నిర్వహించిన నీట్ పరీక్షలో అవకతవకలు రాగానే సీబీఐ విచారణకు ఆదేశించామని తెలిపారు. పరీక్ష రద్దు చేసి జూన్ 21 న 20 లక్షల మందికి తిరిగి విజయవంతంగా నిర్వహించామని, జులై 16 న వెలువడిన ఫలితాల్లో ఎంతోమంది పేద విద్యార్థులు సత్తా చాటారని వివరించారు. ఎగ్జామ్ మాఫియా వల్ల ప్రతిభావంతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానం తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలిపారు. అయితే గత 10 రోజులుగా జరిగిన పరిణామాలు తనను కలచివేశాయని, దేశ వ్యతిరేక శక్తులు ఈ ఆందోళనలను వాడుకోకుండా ఉండేందుకు, విద్యార్థుల భవిష్యత్తు కోసం రాజీనామా చేశానని ఆయన స్పష్టం చేశారు.




### నూతన మంత్రిగా జోషి

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం విద్యాశాఖ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వం ప్రహ్లాద్ జోషికి అప్పగించింది. ప్రస్తుతం వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రిగా ఉన్న ఆయనకు అదనపు బాధ్యతలు ఇచ్చింది. ప్రధాని సలహా మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విద్యాశాఖను కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను సైతం ఆమె ఆమోదించారు. కర్ణాటకలోని ధార్వాడ్ ఎంపీ అయిన జోషి, పునరుత్పాదక ఇంధన శాఖతో పాటు ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ ప్రెసిడెంట్ గా ఉన్నారు.

### ఆందోళన విరమించిన సీజేపీ

మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన అనంతరం కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌తో సీజేపీ నేతలు చర్చలు జరిపారు. అనంతరం తమ ఆందోళనను విరమిస్తున్నట్లు సీజేపీ ప్రతినిధులు ప్రకటించారు. విద్యార్థులపై దేశవ్యాప్తంగా నమోదైన ఎఫ్ఐఆర్లను 4 రోజుల్లో ఎత్తేసేందుకు కేంద్రం అంగీకరించిందని తెలిపారు. భవిష్యత్తులో కేసులతో వేధించబోమని మంత్రులు హామీ ఇచ్చారని చెప్పారు. నీట్ పేపర్ లీక్ బాధిత కుటుంబాలకు 1 కోటి పరిహారం ఇవ్వాలన్న డిమాండ్‌కు కేంద్రం సానుకూలంగా స్పందించిందని వెల్లడించారు. బొద్దింకల సత్తా అందరికీ తెలిసొచ్చిందని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

### వాంగ్‌చుక్ హర్షం వ్యక్తం



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ హర్షం వ్యక్తం చేశారు. ఇది పట్టుదలతో యువత సాధించిన విజయమని ఆయన అభివర్ణించారు. జెన్ జీ, సీజేపీ ప్రతినిధులకు అభినందనలు తెలుపుతూ ఎక్స్ ఖాతాలో పోస్ట్ పెట్టారు. ఇది ప్రజాస్వామ్యం సాధించిన విజయమని, శాంతి, ఓర్పు, నిరంతర పట్టుదలల విజయమని కొనియాడారు. భయాన్ని వీడి దేశం నలుమూలల నుంచి పోరాటానికి కదలివచ్చిన పౌరులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

### ఎనిమిదేళ్లలో తొలి రాజీనామా

గత 8 ఏళ్లలో పదవీకాలం మధ్యలోనే వైదొలగిన ఏకైక కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధానే కావడం విశేషం. 2018 లో విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఎంజే అక్బర్ మీటూ ఆరోపణల నేపథ్యంలో అనూహ్యంగా రాజీనామా సమర్పించారు. ఆ తర్వాత ప్రధానే తప్పుకున్నారు. 2017 లో రాజ్ నాథ్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ మాది యూపీఏ ప్రభుత్వం కాదని, మంత్రులు రాజీనామా చేయడానికి కుదరదని నవ్వుతూ జవాబిచ్చారు. సరిగ్గా 9 ఏళ్లకు ఎన్డీఏ మంత్రివర్గంలోనే ప్రధాన్ అనూహ్య పరిణామాలతో వైదొలగాల్సి రావడం గమనార్హం.

### మంత్రివర్గంలో భారీ మార్పులు

మంత్రి రాజీనామా నేపథ్యంలో న్యూఢిల్లీలో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్, డిప్యూటీ సీఎం షిండేకు అధిష్టానం నుంచి ఢిల్లీకి రావాలని పిలుపు వచ్చింది. దీంతో కేంద్రం భారీ మార్పులకు సిద్ధం అవుతోందా అన్న ఉత్కంఠ నెలకొంది. మహారాష్ట్రలో సీఎం మార్పు జరగబోతోందని, ఫడ్నవీస్‌కు కేంద్ర విద్యాశాఖను ఇవ్వబోతున్నారని శివసేన ఉద్ధవ్ వర్గం నేత సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. నిన్న రాత్రి కేంద్రం 12 శాఖల సెక్రటరీలకు స్థాన చలనం కల్పించడం, అందులో విద్యాశాఖ సెక్రటరీ కూడా ఉండటంతో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై కేంద్రం దృష్టి పెట్టిందన్న చర్చ జరుగుతోంది.

# విద్యార్థులే దేశ భక్తులు!

### ఉద్యమించిన విద్యార్థులకు హ్యాట్సాఫ్
### విద్యా వ్యవస్థలో సంస్కరణలు రావాలి
### ప్రభుత్వానికి గుణపాఠం చెప్పిన యువత
### రాహుల్, ప్రియాంకగాంధీ

**న్యూఢిల్లీ (దీక్ష):** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. దేశవ్యాప్తంగా ఉద్యమించిన విద్యార్థులకు ఆయన ఘనంగా వందనం చేశారు. విద్యార్థులే నిజమైన దేశ భక్తులని ఆయన ప్రశంసించారు. తమ హక్కుల కోసం, పారదర్శకమైన విద్యా వ్యవస్థ కోసం వారు చేసిన పోరాటం దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని రాహుల్ పేర్కొన్నారు. విద్యార్థుల ఐక్యత, పట్టుదల చూస్తే తనకు ఎంతో గర్వంగా ఉందని రాహుల్ గాంధీ అన్నారు. ఈ పరిణామం విద్యా రంగంలో సంస్కరణలకు దారి తీస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులపై ఎవరైతే దాడి చేసి, వారిని కొట్టి, వారిపై కాల్పులు జరిపారో వారందరికీ కచ్చితంగా శిక్ష పడాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి మరోసారి గుర్తు చేస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

### ప్రధాని క్షమాపణ చెప్పాలి



దేశ విద్యార్థుల గౌరవం, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని భారత ప్రధానమంత్రి దాడులకు గురైన విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని రాహుల్ పట్టుబట్టారు. విద్యార్థుల ఆకాంక్షలను గౌరవిస్తూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా తీర్చిదిద్దేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ఇది కేవలం దేశ యువత సాధించిన అఖండ విజయమని ఆమె పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల ఆకాంక్షలే అంతిమమని, యువత తమ గళాన్ని వినిపించి కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పిందని ఆమె అన్నారు. విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలపై విద్యార్థులు చేసిన పోరాటం ఎట్టకేలకు ఫలించిందని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు.

### పారదర్శకత తీసుకు రావాలి

ఇది కోట్లాది మంది విద్యార్థుల విజయమని ఆమె తెలిపారు. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమించారని, వారి పోరాటం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిందని అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మరింత బాధ్యతగా వ్యవహరించాలని కాంగ్రెస్ నేతలు కోరారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, నాణ్యత పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ఇది విద్యార్థుల విజయం!

- ప్రధాన్ రాజీనామాపై సీజేపీ హర్షం
- గాంధీ స్ఫూర్తితోనే శాంతియుతమైన పోరాటం
- జంతర్ మంతర్ వద్ద భారీ సంబరాలు
- సీజేపీ అధినేత అభిజీత్ దీప్కే

**న్యూఢిల్లీ (దీక్ష):** నీట్ పేపర్ లీకుపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నెల రోజుల పాటు సాగించిన పోరాటం ఫలించింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు భారీ సంబరాలు చేసుకున్నారు. ఇది పూర్తిగా విద్యార్థుల అపూర్వ విజయమని సీజేపీ అధినేత అభిజీత్ దీప్కే తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. సుదీర్ఘ పోరాటంతో ఆయన టైఫాయిడ్ బారిన పడ్డారు. శాంతియుతంగా పోరాడితే ఏ లక్ష్యమైనా తప్పకుండా నెరవేరుతుందని అభిజీత్ దీప్కే సంతోషం వ్యక్తం చేశారు. గాంధీజీ స్ఫూర్తితోనే తాము శాంతియుత మార్గంలో నడిచామని ఆయన తెలిపారు. దేశ యువత చేసిన శాంతియుత నిరసనలు వృథా కాలేదని, విద్యార్థుల పోరాటంతో వారి సత్తా ఏంటో ప్రభుత్వానికి తెలిసివచ్చిందని అన్నారు. ఈ విజయం దేశంలోని విద్యార్థులందరిదని, అసలైన ప్రజాస్వామ్యం అంటే ఇదేనని ఆయన కొనియాడారు.

### మిగతా రెండూ నెరవేరాలి

తమకు ఎలాంటి రాజకీయాలు అవసరం లేదని అభిజీత్ స్పష్టం చేశారు. తమ ప్రధాన డిమాండ్లలో 1 నెరవేరిందని, మిగతా 2 డిమాండ్లు నెరవేరే వరకు వేచి చూస్తామని వెల్లడించారు. విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పట్టుబట్టారు. అమాయక విద్యార్థులపై పెట్టిన కేసులన్నీ పూర్తిగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసే వరకు తమ ఉద్యమం ఆగదని హెచ్చరించారు. ఈ విజయం సందర్భంగా సాయంత్రం 6.30



గంటలకు కొవ్వొత్తులతో ర్యాలీ చేద్దామని సీజేపీ నేతలు యువతకు పిలుపునిచ్చారు.

### టైఫాయిడ్ బారిన అభిజీత్

నెల రోజుల పాటు జంతర్ మంతర్ వద్ద అలుపెరగని పోరాటం చేసిన అభిజీత్ దీప్కే తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. తనకు టైఫాయిడ్ వచ్చిందని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్వయంగా వెల్లడించారు. ఇటీవల వైద్య పరీక్షలు చేయించగా వ్యాధి నిర్ధారణ అయిందని, ప్రస్తుతం రోజుకు రెండుసార్లు నరాల ద్వారా వైద్య చికిత్స తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉదయం, సాయంత్రం సెలైన్ ఎక్కిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా శాంతియుతంగా నిరసన తెలిపిన బొద్దింకలందరికీ ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. యువత వల్లే ఈ ఉద్యమం ఇంత పెద్ద విజయంగా మారిందని ఆయన అభినందించారు.

### తల్లి భావోద్వేగ మాటలు

విద్యార్థుల విజయంపై అభిజీత్ తల్లి అనితా దీప్కే తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. పుణెలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ తన అనుభవాలను పంచుకున్నారు. తన కొడుకు ఉద్యమం మొదలు పెట్టినప్పుడు తాను చాలా భయపడ్డానని, అతనికి ఏమైనా జరుగుతుందేమోనని తీవ్ర ఆందోళన చెందానని తెలిపారు. అభిజీత్‌ను పోలీసులు కొట్టినప్పుడు తనలో మరింత భయం పెరిగిందని ఆమె చెప్పారు. దాదాపు నెల రోజుల ఉద్యమ సమయంలో తాము నిద్రపోని రాత్రులు ఎన్నో ఉన్నాయని కన్నీటిపర్యంతమయ్యారు. కనీసం తిండి కూడా సహించేది కాదని, ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని భయం గుప్పిట్లో బతికామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

# దేశ భవిష్యత్తు తో ఆటలొద్దు

- విద్యార్థుల జీవితాలను ప్రచారానికి బలిచేయొద్దు
- ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర
- కేంద్ర ప్రభుత్వ శవయాత్ర, దిష్టి బొమ్మ దహనం




**ఉద్యమ కెరటం, హైదరాబాద్ :** లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న నీట్ పేపర్ లీకేజీలు, 23 మంది విద్యార్థుల మరణాలకు బాధ్యుడిగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూ రు ధర్మేంద్ర తీవ్రంగా డిమాండ్ చేశారు. శనివారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సత్య నారాయణ రెడ్డి భవన్ నుండి వై జంక్షన్ కూడలి వరకు కేంద్ర ప్రభుత్వ శవయాత్ర ర్యాలీ నిర్వహించి, నమూనా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ధోరణిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర మానసిక వేదనలో ఉంటే, ప్రధాని అర్ధరాత్రి ప్రచార వీడియోలు విడుదల చేయడం బాధ్యతా రాహిత్యమని మండిపడ్డారు. అర్ధరాత్రి వీడియోలు పెట్టడం కాకుండా రోడ్డె క్కిన యువతకు పారదర్శకంగా న్యాయం చేయడమే ప్రధాని ప్రాథమిక బాధ్యత అని హితవు పలికారు. గతంలో పేపర్ లీకలపై ఉద్యమాలు చేసిన వ్యక్తే, నేడు విద్యాశాఖ మంత్రిగా ఉండి అవినీతిపై మౌనం వహించడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా సరిపోదని, 23 మంది విద్యార్థుల మరణాలకు, నీట్ పేపర్ లీకేజీలకు బాధ్యుడిగా ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీలు, పరీక్షల అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జాతీయ స్థాయి పరీక్షల్లో పారదర్శకతను పునరుద్ధరించాలని, దేశంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. విద్యా వ్యవస్థలో పెరుగుతున్న అవినీతిని అరికట్టి విద్యార్థుల భవిష్యత్తును కాపాడడమే ప్రభుత్వ తొలి బాధ్యత కాగలదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్, శ్రీమాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్. బాలకృష్ణ, సల్మాన్ బేగ్, మధు, వెంకటేష్, మధుకర్, అలీ, రాహుల్, కిరణ్, ప్రదీప్, రమేష్, సాయి, భరత్, ధీరజ్ సహా 50 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థి-యువత విజయమే

### డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం దేశంలోని విద్యార్థులు, యువత సాగించిన పోరాటానికి దక్కిన విజయమని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ఆత్రం సుగుణ అన్నారు. ఏఐసీసీ పిలుపు మేరకు శనివారం ఆసిఫాబాద్ పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద డీసీసీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణ మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు, విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా నిరంతర పోరాటం సాగిందన్నారు. ఆ ఉద్యమాల ఒత్తిడితోనే కేంద్ర విద్యాశాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో పారదర్శకతను నెలకొల్పి, విద్యార్థుల భవిష్యత్తును కాపాడే వరకు కాంగ్రెస్ పార్టీ తమ పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఇరుకుల మంగ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, డీసీసీ నాయకులు మల్లే ష్, కట్కర్ భీమ్రావు, తారీఖ్, శంకర్, కాంగ్రెస్ ఆసిఫాబాద్ రూరల్ అధ్యక్షుడు మురళి, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు మీర్ కాశీఫ్ హష్మీ, నాయకులు తిరుపతి, సాఫీ, శైలజ తదితరులు పాల్గొన్నారు.



## నిర్లక్ష్యం వహిస్తే ఓటు హక్కు కోల్పోతారు

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** ప్రజలెవరూ నిర్లక్ష్యం చేయకుండా వెంటనే తమ ఎస్ఐఆర్ దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్ సూచించారు. పట్టణంలోని బజార్ వాడి పరిధిలో శనివారం 'ఎస్ఐఆర్' దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ముమ్మరంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్ స్థానిక నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి, పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరైన సమయంలో దరఖాస్తు చేయకపోతే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని, కావున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. నిర్దేశిత ప్రమాణాల ప్రకారం దరఖాస్తు ఫారాలను పూర్తి చేసి, సంబంధిత బిఎల్ఓ లకు త్వరిత గతిన అందజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దూడల అశోక్, సాయి శ్రవణ్, బిఎల్ఓ లక్ష్మీ, మున్సిపల్ సిబ్బంది రామయ్య, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా రాపర్తి మురళి



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** అసిఫాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాపర్తి మురళి నియమితులయ్యారు. శనివారం ఆయన మాట్లాడుతూ తనపై ఈ బాధ్యతను ఉంచిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అజ్మీరా శ్యామ్ నాయక్, మాజీ శాసనసభ్యులు ఆత్రం సక్కు, మాజీ డిసిసి అధ్యక్షులు కె. ప్రసాద్‌లతో పాటు పార్టీ నాయకులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.అలాగే తనకు ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా నిలుస్తున్న మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు, యూత్ కాంగ్రెస్ నాయకులకు, అనుబంధ సంఘాల ప్రజాప్రతినిధులకు, సర్పంచ్‌లకు, మాజీ సర్పంచ్‌లకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని ఏమాత్రం వమ్ము చేయకుండా, సీనియర్ నాయకుల మార్గదర్శకత్వంలో ఆసిఫాబాద్ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని, నిష్ఠతో పనిచేస్తానని ఈ సందర్భంగా రాపర్తి మురళి స్పష్టం చేశారు.

## భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

- హనుమాన్ ఆలయంలో ఎక్కహంఅఖండ భజన

**ఉద్యమ కెరటం,ఆసిఫాబాద్ టౌన్:** జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎక్కాహం అఖండ భజన కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. 24 గంటల పాటు జరిగే ఈ ఎక్కాహంణ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణానికి చెందిన చిలువేరి శంకర్ దాస్ , చకినారపు కృష్ణమూర్తి వారి బృందం తో పాటు స్థానిక భక్త బృందం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తి పారవశ్యంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి వజ్జల శిరీష్ శర్మ ఆధ్వర్యంలో సంకల్ప పూజలు, స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి భజనలు ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ధర్మపురి వెంకటేశ్వర్లు , కార్యదర్శి గుండా వెంకన్న, కోశాధికారి పిన్న వివేక్, ప్రముఖులు ఎకరాల శ్రీనివాస్, గడ్డల వెంకన్న వి. మధు, డాక్టర్ రమేష్, పుల్లూరి గీత కార్యక్రమానికి నేతృత్వం వహించారు. పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భజన బృందాలు పాల్గొన్నాయి. ఈ నెల 26 న ఆదివారం మధ్యాహ్నం12 నుంచి స్వామివారి మహా ప్రసాదం, అన్నదాన వితరణ కార్యక్రమాన్ని నిర్వహించనునట్లు ప్రకటించారు.



## తెలంగాణ వార్డు సభ్యుల ఫోరం

### జిల్లా కన్వీనర్‌గా గులాం జావిద్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** తెలంగాణ వార్డు సభ్యుల ఫోరం ఆసిఫాబాద్ జిల్లా కన్వీనర్ గా గులాం జావీద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా గులాం జావీద్ మాట్లాడుతూ రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం అనుబంధంగా ఏర్పాటైన తెలంగాణ వార్డు సభ్యుల ఫోరం రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల సంక్షేమం, హక్కుల సాధనే లక్ష్యంగా పని చేస్తుందని తెలిపారు. జిల్లా కన్వీనర్ గా నియమించిన రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు బొట్ల కార్తీక్ , రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం జనరల్ సెక్రెటరీ మట్ట శ్రీనివాస్, ఉప అధ్యక్షురాలు కవిత, వార్డ్ సభ్యుల ఫోరం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కనకమామిడి విష్ణు , రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర సురేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో జిల్లా కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల హక్కుల సాధనకు, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

## పార్టీ బలోపేతానికికృషి చేస్తా

### కాంగ్రెస్ టౌన్ నూతన అధ్యక్షుడు మీర్ కాశీఫ్ హష్మీ



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ టౌన్ అధ్యక్షుడిగా మీర్ కాశీఫ్ హష్మీ (ఇమ్రాన్) నియమితులయ్యారు. శనివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి ప్రజలకు చేరువ చేస్తానని, అలాగే స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటానని ఆయన హామీ ఇచ్చారు. తన నియామకానికి సహకరించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ , కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, నియోజకవర్గ ఇన్చార్జి అజ్మీరా శ్యాం నాయక్ , మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ డిసిసి అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ రావులతో పాటు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## మానవ మనుగడకు చెట్లే ఆధారం

### డీసీసీ ఉపాధ్యక్షులు ఎస్.రవీందర్ రెడ్డి



**ఉద్యమ కెరటం, తాండూర్:** మానవ మనుగడకు చెట్లే ఆధారమని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని మంచిర్యాల డీసీసీ ఉపాధ్యక్షులు ఎస్.రవీందర్ రెడ్డి అన్నారు. శనివారం రాజీవ్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ మామిడాల లలితా రాజేశం ఆధ్వర్యంలో నిర్వహించిన హరితహారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవనానికి ఆక్సిజన్ అత్యంత అవసరమని, దీనిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నేడు నాటిన మొక్కలే భావితరాలకు వృక్షాలుగా మారి స్వచ్ఛమైన గాలిని అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడి సకాలంలో వర్షాలు కురిసేందుకు దోహదపడతాయని తెలిపారు. రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించాలంటే విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్‌నగర్ ఉప సర్పంచ్ కాపర్తి సుభాష్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, ఉపాధిహామీ టీఏ ప్రసాద్, వార్డు సభ్యులు తాటిపాముల రాంప్రసాద్, చెప్యాల నిరంజన్ రావు, కస్తూరి రమేష్, మెట్ పద్మ, గొల్లపల్లి నరేష్, చిలువేరు కొమురయ్య, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడిగా చేని కుమార్



**ఉద్యమ కెరటం, తిర్యాణి:** ఇటీవల రాష్ట్రస్థాయిలో ఉప సర్పంచుల ఫోరం ఏర్పాటైన సందర్భంగా తిర్యాణి మండల ఉప సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. తిర్యాణి మండలానికి చెందిన ఉప సర్పంచ్ చేని కుమార్‌ను మండలంలోని అన్ని గ్రామాల ఉప సర్పంచులు ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆసిఫాబాద్ జిల్లా ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దీపక్ ముందే, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు విక్రమ్ హాజరయ్యారు. వారి సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఫోరం ఉపాధ్యక్షుడిగా కనక శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా బోరకుంట యువరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ఉప సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉప సర్పంచులు పాల్గొన్నారు.

# జనగణన డేటా సేకరణ పకడ్బందీగా ఉండాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** భారత జనగణన–2027లో భాగంగా జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గ్రామ, పట్టణ డైరెక్ట రిల వివరాల సేకరణపై ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల స్థాయిలో సేకరించే సమాచారం అత్యంత ఖచ్చితత్వంతో, నాణ్యతతో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. డేటా సేకరణలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ – 1951 జనగణన నుండి నిరంతరం ప్రచురితమవుతూ, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల జనాభా, సామాజిక, ఆర్థిక, మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందించే ప్రభుత్వ ప్రామాణిక గ్రంథంగా నిలుస్తోంది. అభివృద్ధి ప్రణాళికలు, పరిపాలన, పరిశోధన, విధాన రూపకల్పనలో ఈ హ్యాండ్‌బుక్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. హ్యాండ్ బుక్ లో పార్ట్ – లో గ్రామ, పట్టణ డైరెక్టరీలు, పార్ట్ – బి లో ప్రాథమిక గణన సారాంశం ఉంటాయని తెలిపారు. విద్య, వైద్య సౌకర్యాలు, త్రాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, రవాణా, కమ్యూనికేషన్, బ్యాంకింగ్ సేవలు, విద్యుత్, భూమి వినియోగం, సాగునీరు, వ్యవసాయం, పరిశ్రమలు, హస్తకళలు, పట్టణ మౌలిక సదుపాయాలు, మురికివాడల వివరాలు తదితర అంశాలకు సంబంధించిన సమాచారం సేకరించబడుతుందని తెలిపారు.. మొబైల్ యాప్, వెబ్ పోర్టల్, అవసరమైతే భౌతిక షెడ్యూల్ ద్వారా సమాచార సేకరణ జరుగుతుందని తెలిపారు. ఛార్జ్ అధికారుల బాధ్యతలు, ఫీల్డ్ సిబ్బంది నియామకం, యూజర్ ఐడీల సృష్టి, శిక్షణ నిర్వహణ, ఫీల్డ్ వర్క్ పర్యవేక్షణ, డేటా ధృవీకరణ, గౌరవ వేతనాల పంపిణీ, నిర్ణీత గడువులో పనుల పూర్తి వంటి అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. డేటా నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామ/పట్టణ కోడ్లు సక్రమంగా నమోదు చేయాలని, తప్పనిసరి వివరాలన్నీ నమోదు చేయాలని, డూప్లికేట్ సమాచారం లేకుండా సంబంధిత శాఖల రికార్డులతో సరిపోలే విధంగా సమాచారాన్ని నమోదు చేయాలని తెలిపారు. డేటా భద్రత పరంగా యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను గోప్యంగా ఉంచాలని, అధికారిక యాప్, పోర్ట ల్ మాత్రమే ఉపయోగించాలని, అధికారిక సమాచారాన్ని సోషల్ మీడియా / వ్యక్తిగత మెసేజింగ్ ద్వారా పంచరాదని, పని పూర్తయిన వెంటనే లాగ్ అవుట్ చేయాలని తెలిపారు. అలాగే ఫీల్డ్ స్థా యిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం సహాయ వ్యవస్థ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి గురవయ్య, జిల్లా కో–ఆర్డినేటర్ కృష్ణయ్య, శిక్షకుడు అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- సుంకిడిలో మహిళా సంఘ భవనం ప్రారంభం

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మహిళలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని బోథ్ ఎమ్మెల్యే డాక్టర్ అనిల్ జాదవ్ అన్నారు. తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ మహిళా సంఘ భవనాన్ని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం కుచులాపూర్ గ్రామంలో గ్రామ మహిళా సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే సుంకిడి గ్రామంలో మహిళల కోసం నిర్మించనున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులకు కూడా భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రకాష్, స్థానిక నాయకులు



రాజేశ్వర్ కల్యాణం, వెంకన్న యాదవ్, దేవన్న, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యంపై ప్రభుత్వం దృష్టి సారించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** ప్రజారోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ ఆసుప త్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ ఏరియా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం విస్తృత సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులు, వారి బంధువులు, వైద్య సిబ్బంది, ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2004లో వంద పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ, దానికి తగిన విధంగా వైద్య సిబ్బంది, మౌలిక వసతులు కల్పించలేదని విమర్శించారు. 20 మంది వైద్యులు ఉండాల్సిన చోట కేవలం నలుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని, స్పెషలిస్ట్ వైద్యుల కొరతతో ఆపరేషన్ థియేటర్ మూతపడిపోయి శస్త్ర చికిత్సలు నిలిచిపోయాయని అన్నారు. స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర సాంకేతిక సిబ్బంది తీవ్ర కొరతతో పాటు రోగులకు తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేవని తెలిపారు. రెండేళ్ల క్రితం ఏరియా ఆసుపత్రిగా ప్రకటించినప్పటికీ ఇప్పటికీ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ స్థాయిలోనే సేవలు కొనసాగుతున్నాయని, కొత్త భవనాల నిర్మాణం కూడా పూర్తికాలేదని పేర్కొన్నారు. ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ఇన్‌పేషెంట్లు, ఔట్‌పేషెంట్లు ఆసుపత్రికి వస్తున్నప్పటికీ వైద్యుల కొరత కారణంగా అత్యవసర రోగులను జిల్లా కేంద్రం, హైదరాబాద్‌కు తరలించాల్సి వస్తోందని, దీంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఆసుపత్రిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ఖాళీగా ఉన్న వైద్యులు, స్పెషలిస్ట్ వైద్యులు, నర్సులు, సాంకేతిక సిబ్బంది పోస్టులను భర్తీ చేయడంతో పాటు ఆసుపత్రికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కుషణ్ రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం శ్రీనివాస్, ఆనంద్ కుమార్, రాజేందర్, పి. రాజేష్, మిట్టపెల్లి సుదర్శన్, గోమాస సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 10న జైల్ భరో విజయవంతం చేయండి

- క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తి తో మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం
- వేంసూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఆగస్టు 10న సీపీఎం అనుబంధ ప్రజా సంఘాలైన సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూరు మండల కేంద్రంలో వాహిద్ అలీ ఫంక్షన్ హాల్లో శనివారం మూడు సంఘాల కార్యకర్తల సమన్వయ సదస్సు నిర్వహించారు. కొత్త సత్యనారాయణ, కావూరి సుదర్శనం, చీపు రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు శీలం సత్యనారాయణరెడ్డి, సీఐటీయూ జిల్లా నాయకుడు మోరంపూడి పాండురంగారావు, రైతు సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి రావుల రాజబాబు మాట్లాడుతూ బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆగస్టు 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమంలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, యువత, మహిళలు పెద్దఎత్తున పాల్గొని మండల కార్యాలయాలను దిగ్బంధించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల హక్కులకు భంగం కలిగించేలా ఉన్నాయని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గం ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని కోరారు. అలాగే వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేంసూరు మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించి,



రైతులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లూరు చంద్రశేఖర్, అర్వపల్లి గోపాలరావు, జగన్మోహన్ రావు, అర్వపల్లి వెంకటేశ్వరరావు, పుచ్చకాయల వెంకటేశ్వరరావు, గడిపర్తి మోహన్ రావు, ఎలిగినేని రాంబాబు, మోరంపూడి వెంకటేశ్వరరావు, పూరేటి సుగుణరావు, బేతిని నాగేశ్వరరావు, కావూరి భగత్ సింగ్, రావుల కృష్ణారావు, దంకర శ్రీను, గంటల నాగాచారి, చావా రమేష్, శంభునిగూడెం సర్పంచ్ అర్వపల్లి నరసింహారావు, ఎండిమండల వెంకటేశ్వరరావు, తుంగా శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడ రిజర్వ్ ఫారెస్ట్లో ఎలుగుబంటి మృతి

**ముగ్గురు నిందితుల అరెస్ట్**

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా తల్లాడ రిజర్వ్ ఫారెస్ట్లో అక్రమ వేటగాళ్లు విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి వేటకు పాల్పడగా, ఓ ఎలుగుబంటి విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఘటనపై వెంటనే స్పందించిన అటవీ శాఖ అధికారులు విచారణ చేపట్టి, ఈ కేసులో ప్రమేయం ఉన్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. అనంతరం వారిని సత్తుపల్లి కోర్టులో హాజరుపర్చినట్లు అధికారులు తెలిపారు. అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలను అక్రమంగా ఏర్పాటు చేసి వన్యప్రాణులను వేటాడడం అత్యంత తీవ్రమైన నేరమని



పేర్కొన్నారు. ఈ ఘటనలో ఉపయోగించిన సామాగ్రిని స్వాధీనం చేసుకుని, నిందితులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం, అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. అడవుల్లో అక్రమ వేట, విద్యుత్ ఉచ్చులు, పేలుడు పదార్థాలు, ఇతర ప్రమాదకర పద్ధతులతో వేటకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపనున్నట్లు హెచ్చరించారు. అటవీ ప్రాంతాల్లో గస్తీని మరింత కట్టు దిట్టం చేయడంతో పాటు ప్రత్యేక నిఘా బృందాలతో నిరంతర తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. వన్యప్రాణుల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని, అనుమానాస్పద కదలికలు, అక్రమ వేటకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే అటవీ శాఖకు తెలియజేయాలని కోరారు.

## ఉపకార వేతనాల కోసం దరఖాస్తు ల ఆహ్వానం

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులకు 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపకార వేతనాల మంజూరు కోసం ఈ–పాస్ ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి, కన్వీనర్ బి.సునీత కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు పోస్ట్మెట్రిక్ ఉపకార వేతనాల కోసం విద్యార్థుల నుంచి ఫ్రెష్, రెన్యువల్ దరఖాస్తుల నమోదు ప్రక్రియ ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులు ఈ–పాస్ ఆన్లైన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు అవసరమైన వివరాలు నమోదు చేసి నిర్ణీత గడువులోపు దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ఉపకార వేతనాల ద్వారా విద్యార్థులు తమ విద్యాభ్యాసాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తున్నందున అర్హులైన ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## విద్యావంతుడికి కాంగ్రెస్ పగ్గాలు

**కెరమెరి కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా సుజాయిత్ ఖాన్ నియామకం**





**ఉద్యమ కెరటం, కెరమెరి:** యువ నాయకుడు, విద్యావంతుడైన మహమ్మద్ సుజాయిత్ ఖాన్‌ను కాంగ్రెస్ పార్టీ కెరమెరి మండల అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ బలోపేతం, గ్రామస్థాయిలో కాంగ్రెస్‌ను మరింత ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో యువతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలను సమర్థవంతంగా అర్థం చేసుకుని పరిష్కార మార్గాల్లో ముందుకు తీసుకెళ్లగల నాయకత్వం అవసరమనే ఉద్దేశంతో సుజాయిత్ ఖాన్‌కు బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుజాయిత్ ఖాన్ మాట్లాడుతూ తనపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. కెరమెరి మండలంలోని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ని బలోపేతం చేసేందుకు కార్యకర్తలతో కలిసి పనిచేస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, యువతను పార్టీ వైపు ఆకర్షించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడతానని పేర్కొన్నారు.

## బోసిపోయిన వాంకిడి గ్రామసభ

**ప్రజాప్రతినిధులు, అధికారుల గైర్హాజరుతో ప్రజల ఆగ్రహం**



**ఉద్యమ కెరటం, వాంకిడి:** ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక కావాల్సిన గ్రామసభ అధికారుల, ప్రజాప్రతినిధుల గైర్హాజరుతో నామమాత్రంగా ముగిసిందని వాంకిడి గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం వాంకిడి గ్రామ పంచాయతీలో సర్పంచ్ సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరైనప్పటికీ, బాధ్యత కలిగిన పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు గైర్హాజరయ్యారని ఆరోపించారు. గ్రామ పంచాయతీలో మొత్తం 14 మంది వార్డు సభ్యులు ఉండగా, గ్రామసభకు కేవలం ఆరుగురు మాత్రమే హాజరైనట్లు తెలిపారు. ఉప సర్పంచ్‌తో పాటు పలువురు వార్డు సభ్యులు సభకు రాలేదని పేర్కొన్నారు. మండల స్థాయి వివిధ శాఖల అధికారులు కూడా నిర్ణీత సమయానికి హాజరు కాలేదని, కొందరు అధికారులు సభ ముగిసిన అనంతరం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో వచ్చి హాజరు రిజిస్ట ర్‌లో సంతకాలు చేసి వెళ్లిపోయారని గ్రామస్థులు ఆరోపించారు. ప్రజల సమస్యలు వినేందుకు కూడా రాకపోతే ప్రజాప్రతినిధులుగా ఉండటం ఎందుకు..? అంటూ గ్రామస్థ లు ప్రశ్నించారు.

### గత తీర్మానాల అమలుపై అసంతృప్తి ..

గత జూన్ నెలలో రెండుసార్లు గ్రామసభలు నిర్వహించినప్పటికీ, అప్పట్లో చేసిన తీర్మానాలు ఇప్పటివరకు అమలు కాలేదని గ్రామస్థులు గుర్తు చేశారు. పాత సమస్యల పరిష్కారంపై సమీక్ష చేయకుండా కొత్త సమస్యలు చెప్పాలని అడగడం సరికాదని అభిప్రాయపడ్డారు. సమస్యలు చెప్పుకునేందుకు అవకాశం లేకపోయిందని,తాగునీరు, రోడ్లు, మురుగు కాలువలు, రేషన్, పెన్షన్ల వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు వచ్చిన ప్రజలకు సంబంధిత అధికారులు, వార్డు సభ్యులు అందుబాటులో లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యలను ఎవరికి చెప్పాలి, పరిష్కారం ఎప్పుడు లభిస్తుందని సర్పంచ్, గ్రామ కార్యదర్శిని నిలదీశారు. సభలో ఎలాంటి స్పష్టమైన హామీలు ఇవ్వకుండానే వచ్చిన కొద్ది మంది సంతకాలు తీసుకుని సమావేశాన్ని ముగించారని తెలిపారు. గైర్హాజరైన అధికారుల వివరాలను జిల్లా కలెక్ట ర్‌కు నివేదించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### గ్రామసభపై అసంతృప్తి ..

గ్రామసభ ప్రజాస్వామ్యానికి పునాది వంటిదని, ఇది కేవలం రిజిస్టర్ సంతకాలకే పరిమితం కాకుండా ప్రజల సమస్యలకు పరిష్కార వేదికగా మారాలని గ్రామస్థ లు కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యతగా వ్యవహరించి జవాబుదారీతనం పెంచాలని డిమాండ్ చేశారు. మొత్తంగా, అధికారుల గైర్హాజరు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం, అమలు కాని తీర్మానాలతో వాంకిడి గ్రామసభపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమైంది.

## ఆరోగ్య అలవాట్లే భవిష్యత్తు కు పునాది



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** ఆరోగ్యకరమైన అలవాట్లే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది అని న్యూ స్టార్ ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. సత్తుపల్లి పట్టణంలోని వాణి టెక్నో స్కూల్‌లో న్యూ స్టార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 5 నుంచి 13 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు ఆరోగ్యకరమైన జీవనశైలి, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం ప్రాముఖ్యతపై వైద్యులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యూ స్టార్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి చెందిన చిన్నపిల్లల వైద్య నిపుణులు సురేష్ రామాల, ఈఎన్‌టీ వైద్య నిపుణులు ముద్దిశెట్టి ఉమేష్ పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ రామాల మాట్లాడుతూ చిన్నారులు వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సమయానికి నిద్రపోవడం, ఉదయాన్నే లేవడం, శుభ్రమైన నీరు తాగడం, భోజనం ముందు, తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనారోగ్య లక్షణాలు కనిపించినప్పుడు స్వయంగా మందులు వాడకుండా వైద్యులను సంప్రదించాలని అవగాహన కల్పించారు. పాఠశాల యాజమాన్యం న్యూ స్టార్ ఫౌండేషన్, వైద్యులు సురేష్ రామాల,. ముద్దిశెట్టి ఉమేష్‌తో పాటు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## శివ్వారం గోదావరి పైపులైన్ వినియోగంపై నిషేధం

**అనధికార వినియోగం చేస్తే చర్యలు**

**జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జైపూర్ మండలం శివ్వారం గ్రామపంచాయతీ పరిధిలో తాగునీటి సరఫరా కోసం గోదావరి నది నుంచి ఏర్పాటు చేసిన పైపులైన్‌ను ఎవరూ వినియోగించరాదని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య స్పష్టం చేశారు. గోదావరి పైపులైన్‌ను గ్రామ సర్పంచ్ అక్రమంగా వేలం వేశారనే ఫిర్యాదుల నేపథ్యంలో శనివారం విచారణ చేపట్టారు. జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, గ్రామీణ నీటి సరఫరా శాఖ (మిషన్ భగీరథ) ఈఈ వెంకటేశ్వర్, డిప్యూటీ ఈఈ కిరణ్‌లతో కలిసి శివ్వారం గ్రామపంచాయతీని సందర్శించి గోదావరి ఒడ్డున ఏర్పాటు చేసిన పైపులైన్‌ను పరిశీలించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులు, సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజల సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులు, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన మౌలిక సదుపాయాలను అనధికారికంగా వినియోగించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. పైపులైన్‌ను ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన ఈ పైపులైన్‌ను వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించరాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా స్పందిస్తూ ఇకపై ఎవరూ గోదావరి పైపులైన్‌ను వినియోగించరాదని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.సత్యనారాయణ, మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఎన్.రాజమల్లయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి సృజన, సర్పంచ్ అంజన్ గౌడ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్ద చల్లా విశ్వంబర్ రెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జైనూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా షేక్ రషీద్



**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా షేక్ రషీద్‌ను పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ మేరకు పార్టీ నాయకత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, కార్యకర్తల సమన్వయంలో ఆయన అనుభవాన్ని పరిగణనలోకి తీసుకొని ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా షేక్ రషీద్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి, జిల్లా అధ్యక్షురాలు సుగుణ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్యామ్ నాయక్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, డీసీసీ మాజీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌కు, సీనియర్ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా జైనూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానని, ప్రతి గ్రామంలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. షేక్ రషీద్ నియామకంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు



**ఉద్యమ కెరటం, జైనూర్:** అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా గ్రామపంచాయతీ కృషి చేస్తోందని జైనూర్ సర్పంచ్ కొడప ప్రకాష్ తెలిపారు. జైనూర్ మేజర్ గ్రామపంచాయతీలో శనివారం నిర్వహించిన సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేశారు. పెన్షన్ పథకం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఆర్థిక భరోసాగా నిలుస్తోందని సర్పంచ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామ అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి గ్రామపంచాయతీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ఆనంద్ రావు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# అంతరాష్ట్ర దొంగల ముఠా గుట్టు రట్టు

- **వివరాలు వెల్ల డించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**





**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** అంతరాష్ట్ర దొంగల ముఠా గుట్టు రట్టు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా కేంద్రంలో జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గత నెలలో ఆదిలాబాద్ పట్టణంలోని ఐడీబీఐ బ్యాంక్ వద్ద నగదు డ్రా చేసిన వ్యక్తిని అత్యంత చాకచక్యంగా వెంబడించి, నేతాజీ చౌక్ సమీపంలో పార్క్ చేసిన ఆక్టివా డిక్కీని పగులగొట్టి రూ.3లక్షల నగదును అపహరించిన కేసును ఛేదించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ ముఠా నాలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఇదే తరహా నేరాలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు. నిందితుల నేర విధానాన్ని వివరిస్తూ, బ్యాంకుల వద్ద నగదు డ్రా చేసే వ్యక్తులపై కన్నేసి, వారిని రహస్యంగా వెంబడించి, స్కూటీ డిక్కీలు, కార్ల అద్దాలు పగులగొట్టి నగదు చోరీ చేయడం ఈ ముఠా పద్ధతి అని అన్నారు. కర్ణాటకలోని భద్రావతికి చెందిన శంకర్ తన సహచరులు శేఖర్, శ్రీనివాస్, సంజీవ్, సాయిలతో కలిసి ఈ అంతరాష్ట్ర ముఠాగా ఏర్పడినట్లు తెలిపారు. గతనెల 22న భద్రావతి నుంచి బయల్దేరి చంద్రపూర్ మీదుగా వచ్చి ఒక మోటార్ సైకిల్ దొంగిలించడంతో పాటు, అక్కడ కార్ అద్దాలు పగులగొట్టి రూ.25వేలు చోరీ చేశారని, ఆ తర్వాత ఆదిలాబాద్‌కు వచ్చి ఐడీబీఐ బ్యాంక్ వద్ద రూ.3లక్షలు కొల్లగొట్టినట్లు నిందితుడు అంగీకరించాడని వివరించారు. ఈ ముఠాపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, విజయవాడ, విశాఖపట్నం, చంద్రపూర్, ఔరంగాబాద్, బెంగళూరు, బళ్లారి తదితర ప్రాంతాల్లో ఇప్పటివరకు మొత్తం 22 కేసులు నమోదై ఉన్నాయని చెప్పారు. ప్రధాన నిందితుడు శంకర్ అలియాస్ శంకరప్పను అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి రూ.1లక్ష 80వేల నగదు, ఒక సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పరారీలో ఉన్న మిగతా నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయని, ఆయా రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకుంటూ దర్యాప్తును మరింత ముమ్మరం చేశామని తెలిపారు. బ్యాంకుల నుంచి భారీ మొత్తంలో నగదు డ్రా చేసినప్పుడు వాటిని వాహనాల డిక్కీలలో, కార్లలో ఉంచి నిర్లక్ష్యంగా వెళ్లవద్దని, ఎవరైనా అపరిచిత వ్యక్తులు తమను వెంబడిస్తున్నట్లు అనుమానం వస్తే వెంటనే అప్రమత్తమై సమీప పోలీస్ స్టేషన్, లేనియెడల డయల్ 100ను సంప్రదించాలని సూచించారు. ఈ కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబర్చిన ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, వన్‌టౌన్ సీఐ బి.సునీల్ కుమార్, ఎస్సైలు నాగనాథ్, సంజయ్, సైబర్ క్రైమ్ ఎస్సై గోపికృష్ణ, సిబ్బంది రమేష్, త్రిశూల్, హనుమంతు తదితరులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# చట్టాలపై అవగాహనతోనే హక్కుల పరిరక్షణ సాధ్యం

**జిల్లా జడ్జి కె.ప్రభాకర రావు**





**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్ :** ప్రజల్లో చట్టాలపై సమగ్ర అవగాహన పెంపొందినప్పుడే రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతిఒక్కరూ సమర్థవంతంగా వినియోగించుకోగలరని జిల్లా జడ్జి, డీఎల్ఎస్ఏ ఛైర్మన్ కె.ప్రభాకర రావు అన్నారు. న్యాయ అవగాహనను గ్రామస్థాయి వరకు విస్తరించి జిల్లాను వివాదరహిత జిల్లాగా తీర్చిద్దేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన 'నాల్సా చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్' అవగాహన సదస్సు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, బాలల రక్షణ అధికారుల ఓరియెంటేషన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ భారత రాజ్యాంగం గర్భస్థ శిశువు నుంచి మరణించిన వ్యక్తి వరకు ప్రతిఒక్కరి హక్కులను పరిరక్షించే గొప్ప రాజ్యాంగమని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి పౌరుడు తన హక్కులతో పాటు బాధ్యతలను కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా జిల్లా డీఎల్ఎస్ఏను సంప్రదించాలని సూచించారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలు, పిల్లలు తదితర అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని అన్నారు. ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. పిల్లల హక్కుల పరిరక్షణపై పాఠశాలల్లో చేపట్టనున్న అవగాహన కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మూడు పాఠశాలలకు వచ్చే జనవరిలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, జడ్జి చేతుల మీదుగా ప్రత్యేక అవార్డులు అందజేయనున్నట్లు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, బాలికల సంక్షేమం, బాలల హక్కులు, చట్టాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు ఏడాది పొడవున ప్రత్యేక కార్యాచరణ అమలు చేయనున్నట్లు తెలిపారు. జూన్ నుంచి వచ్చే ఏడాది మే వరకు ప్రతినెల ఒక నిర్దిష్ట అంశాన్ని ఎంపిక చేసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, చర్చలు, ఓరియెంటేషన్ తరగతులు, పోటీలు నిర్వహించాలని సూచించారు. బాలల హక్కులు, పోక్సో చట్టం, సైబర్ భద్రత, మంచి-చెడు స్పర్శ, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై విద్యార్థులను చైతన్యవంతులను చేయాలని పేర్కొన్నారు. పాఠశాలలు కేవలం విద్య బోధించే కేంద్రాలుగా కాకుండా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, విలువల పెంపొందింపుకు వేదికలుగా మారాలని అన్నారు. ప్రతి మూడవ శనివారం నిర్వహించే పేరెంట్-టీచర్ సమావేశాల్లో తల్లి దండ్రులకు కూడా బాలల రక్షణ, సైబర్ నేరాలు, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. విద్యార్థుల్లోపెరుగుతున్న మొబైల్ ఫోన్ వినియోగం, సోషల్ మీడియా ప్రభావంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులు తమ సమస్యలను గోప్యంగా తెలియజేసేందుకు ఫిర్యాదు పెట్టెలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాలను ఒకరిద్దరు ఉపాధ్యాయుల బాధ్యతగా కాకుండా మొత్తం ఉపాధ్యాయ బృందం సమిష్టిగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి ఉత్తమ ప్రతిభ కనబర్చిన పాఠశాలలు, సంబంధిత అధికారులకు 2027 మే నెలలో జిల్లా స్థాయి, అనంతరం హైకోర్టు స్థాయిలో ప్రత్యేక గుర్తింపు, ప్రశంసలు లభించే అవకాశం ఉందని తెలిపారు. అదనపు ఎస్పీ మౌనిక మాట్లాడుతూ బాలల భద్రత, పోక్సో చట్టంపై అవగాహన కల్పించడంలో "పోలీస్ అక్క" కార్యక్రమం విశేష ఫలితాలు సాధిస్తోందన్నారు. గత జూన్ నుంచి ఇప్పటివరకు 43 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడంతో పాటు వందకు పైగా ఫిర్యాదులు స్వీకరించి, 23 బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు వివరించారు. విద్యార్థుల ప్రవర్తనలో కనిపించే మార్పులను ఉపాధ్యాయులు ముందుగానే గుర్తించి స్పందిస్తే అనేక మంది పిల్లల భవిష్యత్తును రక్షించవచ్చని పేర్కొన్నారు. జిల్లా చట్ట పరమైన సేవల సంస్థ కార్యదర్శి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఉపాధ్యాయులను బాలల రక్షణ అధికారులుగా భాగస్వామ్యం చేస్తూ ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ మాదవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, బాలల సంరక్షణ అధికారి రాజేంద్ర ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, బాలల రక్షణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దళిత ప్రజాప్రతినిధుల సమస్యలపై భట్టి విక్రమార్కకు వినతి

- **ప్రజాభవన్‌లో దళిత ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎస్సీ సెల్ నేతల సమావేశం**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను దళిత ప్రజాప్రతినిధులు కలిసి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరిగిన ఈ సమావేశంలో దళిత ఎమ్మెల్యేలు, పార్ల మెంట్ సభ్యులు, రాజ్యసభ సభ్యులు, దళిత కార్పొరేషన్ చైర్మన్లు, ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.తెలంగాణ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, పార్ల మెంట్ సభ్యుడు మల్లు రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగామయి దయానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని దళిత ప్రజాప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలు, నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులు, దళిత సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లా రు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. వినతి పత్రాన్ని స్వీకరించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దళిత ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన అంశాలపై సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. ప్రభుత్వం పరిధిలో పరిష్కరించాల్సిన సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దళిత ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అభినందించారు. సామాజిక న్యాయం, దళిత సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో దళిత ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాజ్యసభ సభ్యులు, ఎస్సీ సెల్ నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల పోరాట ఫలితం

- **వామపక్ష విద్యార్థి సంఘాల హర్షం**





**ఉద్యమ కెరటం, హన్మకొండ:** నీట్ పేపర్ లీకేజీ, అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థులు, వామపక్ష విద్యార్థి సంఘాల పోరాట విజయమని ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్‌బీ, పీడీఎస్‌యూ, ఏఐడీఎస్‌ఓ సంఘాల హన్మకొండ జిల్లా కమిటీలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ ఫస్ట్ గేట్ వద్ద వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు స్వీట్లు పంపిణీ చేసి హర్షం వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా ఢిల్లీ జంతర్ మంతర్‌తో పాటు దేశ వ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాలు నిర్వహించిన ఆందోళనల ఫలితంగానే కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చిందని నాయకులు తెలిపారు. ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి హకీమ్ నవీద్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బోయినపల్లి అజయ్, ఏఐడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి కె.వెంకటేష్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ, విద్యారంగ సమస్యలపై విద్యార్థి యువజన సంఘాలు సాగించిన పోరాటం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చిందన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల కోసం పర్యావరణవేత్త సోనం వాంగ్‌చుక్ చేపట్టిన దీక్షలు, ఇతర ప్రజా ఉద్యమాలు, వామపక్ష విద్యార్థి యువజన సంఘాల పోరాటాలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయని పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాతోనే సమస్యలు పూర్తిగా పరిష్కారం కావని అన్నారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా నష్ట పోయిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం అందించాలని, ఉద్యమాల్లో పాల్గొన్న విద్యార్థులు, యువతపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ఉద్యమాలపై ప్రయోగిస్తున్న కఠిన చట్టాలను ఉపసంహరించుకోవాలని కోరారు. విద్యారంగ పరిరక్షణ కోసం కొనసాగుతున్న పోరాటానికి సహకరించిన ప్రజలు, ప్రజాస్వామికవాదులకు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐడీఎస్‌ఓ జిల్లా ఉపాధ్యక్షులు మధు, పీడీఎస్‌యూ నాయకులు అనిల్, సద్దాం హుస్సేన్, ఏఐఎస్‌బీ నాయకులు తాజ్ ఉద్దీన్, జలాల్ తదితరులు పాల్గొన్నారు.

# రోజూ ఇంట్లో వాడే ప్లాస్టిక్ వస్తువులతో ఊబకాయం.. సైంటిస్టుల పరిశోధనల్లో వెల్లడి..

ఊబకాయం అంటే ఎక్కువగా తినడం, తక్కువగా కదలడం వల్లే వస్తుందని చాలా కాలంగా భావిస్తున్నారు. అయితే తాజాగా వెలువడుతున్న పరిశోధనలు మరో కీలక విషయాన్ని వెలుగులోకి తెస్తున్నాయి. మనం రోజూ ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువులు, ఆహార ప్యాకేజింగ్, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల్లో ఉండే కొన్ని రసాయనాలు శరీరంలోని హార్మోన్ల పనితీరును దెబ్బతీసి ఇన్సులిన్ నిరోధకత (ఇన్సులిన్ రెసిస్టెన్స్)ను పెంచడంతోపాటు కొవ్వు నిల్వలను అధికం చేస్తున్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఈ రసాయనాలను ఒబిసోజెన్స్ (Obesogens) అని పిలుస్తారు. ఒబిసోజెన్స్ అంటే శరీరంలో కొవ్వు జీవక్రియను ప్రభావితం చేసే రసాయనాలు. సాధారణంగా ఆహారం ద్వారా లభించే శక్తిని శరీరం వినియోగించాల్సి ఉండగా, ఈ రసాయనాల ప్రభావంతో అదే శక్తి కొవ్వుగా నిల్వ అయ్యే అవకాశాలు పెరుగుతాయి. ఇవి ఈస్ట్రోజెన్, థైరాయిడ్, గ్లూకోకార్టికాయిడ్ వంటి హార్మోన్ల పనితీరును అనుకరించడం లేదా వాటి పనిని అడ్డుకోవడం ద్వారా జీవక్రియలలో మార్పులు తీసుకొస్తాయి.




### ప్లాస్టిక్ ఉత్పత్తులే కారణం..

ఈ రసాయనాలకు ప్రధాన వనరు ప్లాస్టిక్ ఉత్పత్తులే. పాలీకార్బొనేట్ ప్లాస్టిక్‌లు, ఆహార డబ్బాల లోపలి పూతల్లో ఉపయోగించే బిస్‌ఫెనాల్-ఎ (BPA), ప్లాస్టిక్‌ను మృదువుగా ఉంచేందుకు ఉపయోగించే థాలేట్స్ (Phthalates) ను అత్యంత ఎక్కువగా అధ్యయనం చేసిన ఒబిసోజెన్స్‌గా గుర్తించారు. ప్లాస్టిక్ డబ్బాలను వేడి చేసినప్పుడు, ఎక్కువకాలం ఉపయోగించినప్పుడు లేదా ఆమ్లత్వం ఎక్కువగా ఉన్న ఆహారాన్ని నిల్వ చేసినప్పుడు ఈ రసాయనాలు ఆహారంలోకి కలిసిపోయి శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంటుంది. ఇన్సులిన్ రెసిస్టెన్స్ అంటే రక్తంలో ఉన్న గ్లూకోజ్‌ను కణాలు సరిగా స్వీకరించకపోవడం. ఇది టైప్-2 డయాబెటిస్, మెటబాలిక్ సిండ్రోమ్‌కు ప్రధాన కారణంగా మారుతుంది. BPA వంటి రసాయనాలు క్లోమగ్రంథిలోని బీటా కణాలపై ప్రభావం చూపి అవసరానికి మించి ఇన్సులిన్‌ను విడుదల చేయిస్తాయి. ఈ పరిస్థితిని హైపర్‌ఇన్సులినీమియా అంటారు. దీర్ఘకాలంలో కణాలు ఇన్సులిన్‌కు స్పందించకుండా మారి ఇన్సులిన్ నిరోధకత ఏర్పడుతుంది.

### కొవ్వు కణాలు వేగంగా నిర్మాణం..

అదే సమయంలో ఈ రసాయనాలు శరీరంలో కొత్త కొవ్వు కణాలు ఏర్పడే ప్రక్రియను కూడా వేగవంతం చేస్తాయి. దీనివల్ల కొవ్వు నిల్వ సామర్థ్యం పెరిగి ఊబకాయం వచ్చే ప్రమాదం అధికమవుతుంది. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ రోచెస్టర్ మెడికల్ సెంటర్ నిర్వహించిన పరిశోధనలో మూత్రంలో థాలేట్స్ స్థాయిలు ఎక్కువగా ఉన్న పురుషుల్లో పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోవడం, ఇన్సులిన్ రెసిస్టెన్స్ ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఈ రసాయనాలు టెస్టోస్టెరాన్ పనితీరును కూడా ప్రభావితం చేసి జీవక్రియలలో మార్పులు తీసుకువచ్చే అవకాశం ఉంటుందని పరిశోధకులు తెలిపారు. మరోవైపు బ్రునెల్ యూనివర్సిటీ లండన్, న్యూయార్క్ యూనివర్సిటీ, వ్రిజే యూనివర్సిటీ ఆమ్‌స్టర్‌డామ్ పరిశోధకులు నిర్వహించిన మెటా-విశ్లేషణలో చిన్న వయస్సులోనే తక్కువ మోతాదులో వీటికి గురైన జంతువుల్లో తర్వాతి జీవితంలో శరీర కొవ్వు, ట్రైగ్లిసరైడ్లు, ఫ్రీ ఫ్యాటీ యాసిడ్లు గణనీయంగా పెరిగినట్లు గుర్తించారు. ప్రస్తుతం అనుమతించిన భద్రతా పరిమితుల్లో ఉన్న మోతాదులే అయినప్పటికీ ఇలాంటి ప్రభావాలు కనిపించడం ఆందోళన కలిగించే విషయమని పరిశోధకులు పేర్కొన్నారు.

### ఈ జాగ్రత్తలు పాటించాలి..

ప్లాస్టిక్‌ను పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోయినా, కొన్ని అలవాట్లు పాటించడం ద్వారా ఈ రసాయనాల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు. ప్లాస్టిక్ డబ్బాల్లో ఆహారాన్ని మైక్రోవేవ్‌లో వేడి చేయకుండా గాజు లేదా సిరామిక్ పాత్రలు ఉపయోగించడం మంచిది. తాగునీటిని కార్బన్ లేదా రివర్స్ ఆస్మోసిస్ (RO) ఫిల్టర్ ద్వారా శుద్ధి చేసుకోవడం వల్ల మైక్రోప్లాస్టిక్‌లు తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే ప్లాస్టిక్‌లో ప్యాక్ చేసిన ప్రాసెస్డ్ ఆహారాల కంటే తాజా, సహజ ఆహారాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఒబిసోజెన్స్‌కు గురయ్యే అవకాశాన్ని తగ్గించుకోవచ్చు. ఊబకాయం, ఇన్సులిన్ రెసిస్టెన్స్‌ను నివారించాలంటే కేవలం వ్యాయామం, ఆహార నియంత్రణ మాత్రమే కాకుండా దైనందిన జీవితంలో ప్లాస్టిక్ వినియోగాన్ని కూడా తగ్గించుకోవడం అవసరమని పరిశోధకులు సూచిస్తున్నారు. చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దీర్ఘకాలంలో జీవక్రియల ఆరోగ్యాన్ని మెరుగ్గా కాపాడుకోవచ్చని వారు పేర్కొన్నారు.

# మహిళల గుండె పనితీరుపైనా ప్రభావం చూపే రుతుచక్రం.. అధ్యయనంలో వెల్లడి..



మహిళల రుతుచక్రం కేవలం పునరుత్పత్తి ఆరోగ్యానికే పరిమితం కాదని, గుండె పనితీరుపైనా ప్రభావం చూపుతుందని తాజా అధ్యయనం వెల్లడించింది. నెలసరి సమయంలో శరీరంలో జరిగే హార్మోన్ల మార్పులు గుండె స్పందన నియంత్రణ వ్యవస్థలో మార్పులకు కారణమవుతాయని పరిశోధకులు గుర్తించారు. అయితే ఈ మార్పులు కండరాల బలం, మానసిక స్థితి లేదా పనులు చేయాలనే ఉత్సాహంపై గణనీయమైన ప్రభావం చూపవని అధ్యయనం స్పష్టం చేసింది. ఈ పరిశోధన మహిళల శరీరం సహజ హార్మోన్ల మార్పులకు ఎలా స్పందిస్తుందనే అంశంపై మరింత స్పష్టతను అందిస్తోంది. ముఖ్యంగా మహిళలు, క్రీడాకారిణులు, వైద్య నిపుణులు గుండె ఆరోగ్యానికి సంబంధించిన పరీక్షల ఫలితాలను అర్థం చేసుకునేటప్పుడు రుతుచక్ర దశలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని పరిశోధకులు సూచిస్తున్నారు.

### హార్ట్ రేట్ వెరీయబిలిటీ అంటే..

హార్ట్ రేట్ వెరీయబిలిటీ (HRV) అంటే గుండె కొట్టుకునే ప్రతి రెండు స్పందనల మధ్య ఉండే సమయ వ్యవధిలో కనిపించే చిన్నచిన్న తేడాలను సూచిస్తుంది. గుండె ఒకే రీతిలో కొట్టుకుంటున్నట్లు కనిపించినప్పటికీ, ప్రతి స్పందన మధ్య విరామం స్వల్పంగా మారుతూ ఉంటుంది. ఈ మార్పులను స్వయంచాలక నాడీ వ్యవస్థ నియంత్రిస్తుంది. ఇందులో ఫైట్ ఆర్ ఫ్లైట్ వ్యవస్థ, రెస్ట్ అండ్ డైజెస్ట్ వ్యవస్థ అనే రెండు భాగాలు ఉంటాయి. సాధారణంగా ఎ=ఎ ఎక్కువగా ఉంటే శరీరం ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొంటోందని భావిస్తారు. ఎ=ఎ తక్కువగా ఉంటే శారీరక లేదా మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం అనేక స్మార్ట్‌వాచ్‌లు, ఫిట్‌నెస్ ట్రాకర్లు కూడా ఎ=ఎని కొలుస్తున్నాయి. ఈ అధ్యయనంలో సహజంగా రుతుచక్రం ఉన్న ఆరోగ్యవంతమైన మహిళలను ఎంపిక చేసి, వారి రుతుచక్రంలోని వివిధ దశల్లో గుండె పనితీరు, కండరాల బలం, మానసిక స్థితి, పనులు చేయాలనే ఉత్సాహాన్ని పరిశీలించారు. ప్రారంభ ఫాలిక్యులర్ దశ, అండోత్సర్గం దశ, ల్యూటియల్ దశలలో HRVతో పాటు ఇతర శారీరక మార్పులను పోల్చి హార్మోన్ల ప్రభావాన్ని విశ్లేషించారు.

### రుతు సమయంలో స్పష్టమైన మార్పులు..

పరిశోధనలో అత్యంత ముఖ్యంగా గుర్తించిన విషయం ఏమిటంటే, రుతుచక్రంలోని ప్రతి దశలో HRVలో స్పష్టమైన మార్పులు కనిపించాయి. హార్మోన్ల స్థాయిలు మారేకొద్దీ గుండెను నియంత్రించే స్వయంచాలక నాడీ వ్యవస్థ పనితీరులో కూడా మార్పులు నమోదయ్యాయి. ముఖ్యంగా ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరోన్ హార్మోన్ల హెచ్చుతగ్గులు గుండె స్పందన నియంత్రణపై ప్రభావం చూపుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. అయితే కండరాల బలంలో మాత్రం ఎలాంటి గణనీయమైన మార్పులు కనిపించలేదు. అలాగే మహిళల మానసిక స్థితి, పనులు చేయాలనే ఉత్సాహం కూడా రుతుచక్రంలోని వివిధ దశల్లో పెద్దగా మారలేదని అధ్యయనం తెలిపింది. అంటే హార్మోన్ల మార్పులు గుండె నియంత్రణ వ్యవస్థపై ప్రభావం చూపినా, శారీరక పనితీరు మాత్రం చాలా వరకు స్థిరంగానే ఉంటుందని పరిశోధకులు పేర్కొన్నారు.

### ట్రాక్ చేయవచ్చు..

ఈస్ట్రోజెన్ రక్తనాళాల ఆరోగ్యాన్ని కాపాడడంలో సహాయపడటంతో పాటు గుండె స్పందనను ప్రశాంతంగా ఉంచే వ్యవస్థకు మద్దతు ఇస్తుంది. మరోవైపు ప్రొజెస్టెరోన్ కొన్ని దశల్లో గుండె స్పందనను వేగవంతం చేసే నాడీ వ్యవస్థను ఎక్కువగా చురుకుగా మారుస్తుంది. అందువల్ల ఈ రెండు హార్మోన్ల స్థాయిల్లో నెలనెలా జరిగే మార్పులు HRVలో తేడాలకు కారణమవుతాయి. ఈ ఫలితాల ప్రకారం స్మార్ట్‌వాచ్‌లు లేదా ఫిట్‌నెస్ ట్రాకర్ల ద్వారా ఎ=ఎని గమనించే మహిళలు నెలసరి సమయంలో సహజంగానే కొన్ని మార్పులను చూడవచ్చు. అలాంటి మార్పులు కనిపించిన ప్రతిసారి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పరిశోధకులు సూచిస్తున్నారు. అలాగే క్రీడాకారిణుల పనితీరు, గుండె ఆరోగ్యానికి సంబంధించిన అంచనాలు వేసేటప్పుడు రుతుచక్ర దశలను కూడా పరిగణనలోకి తీసుకుంటే మరింత కచ్చితమైన ఫలితాలు పొందే అవకాశం ఉందని అధ్యయనం వెల్లడించింది.

# ఇక వైరస్‌లు అన్నింటికీ ఒకే టీకా.. అభివృద్ధి చేస్తున్న శాస్త్రవేత్తలు..

ప్రపంచాన్ని వణికించిన కోవిడ్-19, సార్స్, ఎబోలా వంటి వైరస్‌లకు ఒక్కో వైరస్‌కు ఒక్కో టీకా అభివృద్ధి చేయాల్సిన పరిస్థితి ఉంది. అయితే భవిష్యత్తులో ఒకే టీకాతో ఒకే వైరస్ కుటుంబానికి చెందిన అనేక వైరస్‌ల నుంచి రక్షణ కల్పించే సాంకేతికత అందుబాటులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు కృత్రిమ మేధస్సు (AI) సాయంతో రూపొందించిన కొత్త తరహా వ్యాక్సిన్ సాంకేతికత వైరస్‌ల మొత్తం కుటుంబంపైనే రోగనిరోధక శక్తిని పెంపొందించే సామర్థ్యం కలిగి ఉండే అవకాశాలు ఉన్నాయని తాజా పరిశోధనలు సూచిస్తున్నాయి. భవిష్యత్తులో మరో మహమ్మారిని అడ్డుకునే దిశగా ఇది కీలక ముందడుగు అవుతుందని పరిశోధకులు భావిస్తున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న చాలా టీకాలు ఇప్పటికే వ్యాపించిన వైరస్ రకాలను లక్ష్యంగా చేసుకుని తయారవుతాయి. కానీ వైరస్‌లు వేగంగా రూపాంతరం చెందుతుండటంతో, కొన్ని నెలల తర్వాత వ్యాప్తి చెందే కొత్త వేరియంట్‌పై అవి తక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అందువల్ల వైరస్‌ను వెంబడిస్తూ కొత్త టీకాలు తయారు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

### ఏఐ సహాయంతో గుర్తింపు..

ఈ సమస్యకు పరిష్కారంగా శాస్త్రవేత్తలు AI సాయంతో ఒకే వైరస్ కుటుంబంలోని అన్ని రకాల వైరస్‌లలో సాధారణంగా ఉండే కీలక భాగాలను గుర్తించారు. రోగనిరోధక వ్యవస్థ గుర్తించే ఆ సాధారణ లక్షణాలనే లక్ష్యంగా చేసుకుని కొత్త టీకాను రూపొందించారు. దీంతో ఒక్క వేరియంట్‌కే కాకుండా అదే కుటుంబానికి చెందిన అనేక వైరస్‌లపై రోగనిరోధక శక్తిని పెంచే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. ఈ పరిశోధనకు ప్రేరణ 2013 నుంచి 2016 వరకు పశ్చిమ ఆఫ్రికాలో సంభవించిన ఎబోలా వ్యాప్తి సమయంలో వచ్చింది. ప్రారంభంలో ఆ వ్యాధిని లాసా జ్వరం, కలరా లేదా గ్యాస్ట్రోఎంటరైటిస్‌గా తప్పుగా గుర్తించడంతో అసలు వైరస్‌ను నిర్ధారించడానికే మూడు నుంచి నాలుగు నెలలు పట్టింది. అప్పటికే వైరస్ గినియా నుంచి సియెర్రా లియోన్, లైబీరియా వంటి దేశాలకు వేగంగా వ్యాపించి వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) అంచనాల ప్రకారం ఆ వ్యాప్తిలో సుమారు 11,300 మంది మృతి చెందారు.

### ముందుగానే సిద్ధం కావచ్చు..

ఈ అనుభవం తర్వాత వైరస్‌లను గుర్తించడం, వాటికి టీకాలు అభివృద్ధి చేసే విధానాన్ని పూర్తిగా మార్చాల్సిన అవసరం ఉందని పరిశోధకులు నిర్ణయించారు. అందుకోసం వివిధ వైరస్‌లకు సంబంధించిన అందుబాటులో ఉన్న సమాచారాన్ని AIతో విశ్లేషించి, వాటిలోని పోలికలు, తేడాలను గుర్తించారు. ఈ విధానం వల్ల ఒకే వైరస్ రూపానికే కాకుండా దాని కుటుంబంలోని ఇతర రూపాలను కూడా ముందుగానే గుర్తించేలా రోగనిరోధక వ్యవస్థను సిద్ధం చేయడం సాధ్యమవుతుందని వారు భావిస్తున్నారు. జనాభా పెరుగుదల, అంతర్జాతీయ ప్రయాణాలు అధికమవడం, అడవుల్లో మానవ జోక్యం పెరగడం వంటి కారణాలతో జంతువుల నుంచి మనుషులకు కొత్త వైరస్‌లు వ్యాపించే ప్రమాదం పెరుగుతోందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. జంతువుల్లో హానికరం కాని వైరస్‌లు మనుషుల శరీరంలోకి వచ్చినప్పుడు సహజ రోగనిరోధక శక్తి లేకపోవడంతో అవి వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని వారు పేర్కొన్నారు.

### ప్రారంభ ట్రయల్స్ విజయవంతం..

ఈ AI ఆధారిత సాంకేతికతతో రూపొందించిన యూనివర్సల్ సార్బెకో కరోనా వైరస్ వ్యాక్సిన్‌ను 39 మంది స్వచ్ఛంద సేవకులపై పరీక్షించారు. యూనివర్సిటీ హాస్పిటల్ సౌతాంప్టన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రారంభ క్లినికల్ ట్రయల్‌లో ఎలాంటి తీవ్రమైన భద్రతా సమస్యలు గుర్తించలేదని, ఈ ఫలితాలు జర్నల్ ఆఫ్ ఇన్ఫెక్షన్లో ప్రచురితమయ్యాయి. ఇప్పుడు ఈ వ్యాక్సిన్‌ను మరింత పెద్ద స్థాయిలో క్లినికల్ పరీక్షలకు తీసుకెళ్లేందుకు పరిశోధకులు సిద్ధమవుతున్నారు. చరిత్రలో బ్లాక్ డెత్, 1918 ఫ్లూ మహమ్మారి నుంచి కోవిడ్-19 వరకు అనేక మహమ్మారులు ప్రపంచాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి. ముఖ్యంగా ఇన్‌ఫ్లుయెంజా వైరస్ భవిష్యత్తులో పెద్ద సవాలుగా మారే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అయితే ఆధునిక AI సాంకేతికతను ఉపయోగించి మరింత వేగంగా, మరింత కచ్చితంగా వ్యాక్సిన్‌లను అభివృద్ధి చేసే వేదికను రూపొందిస్తున్నామని, ఇది టీకాల తయారీలో కొత్త యుగానికి నాంది పలికే అవకాశముందని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# వైభవ్ సూర్యవంశీపై బీసీసీఐ సంచలన ప్రణాళిక

టీమిండియా బ్యాటింగ్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై బీసీసీఐ సంచలన ప్రణాళిక రచిస్తున్నట్లు తెలుస్తోంది. వైభవ్‌ను భవిష్యత్తులో ఆల్‌రౌండర్‌గా తీర్చిదిద్దాలని భారత క్రికెట్ బోర్డు యోచిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు భారత స్టాండ్‌ఇన్ బౌలింగ్ కోచ్ సునీల్ జోషి ఇటీవల మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశాడు. 15 ఏళ్ల వైభవ్ ఐపీఎల్ 2026లో రికార్డు స్థాయి ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. అనంతరం ఇంగ్లండ్‌తో సిరీస్‌లో సీనియర్ జట్టు తరఫున అరంగేట్రం చేసినప్పటికీ, ఆశించిన ప్రభావం చూపలేక పోయాడు. అయితే జింబాబ్వేతో జరిగిన తొలి టీ20లో కేవలం 18 బంతుల్లోనే అర్ధసెంచరీ నమోదు చేసి, తన సత్తా మరోసారి రుజువు చేసుకున్నాడు.



**బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌పైనా దృష్టి**

వైభవ్‌లో బౌలింగ్ సామర్థ్యం కూడా ఉందని, సమయం లభించిన ప్రతిసారీ బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అతనితో ప్రత్యేకంగా పని చేస్తామని జోషి తెలిపారు. బౌలింగ్‌లో మెరుగుదల కనిపించిన వెంటనే దానిపై పూర్తి దృష్టి సారిస్తామని ఆయన స్పష్టం చేశారు. అయితే ప్రస్తుతానికి బ్యాటింగ్‌పైనే ప్రధానంగా దృష్టి పెట్టాలని, హరారే మైదానం వైభవ్‌కు కలిసొచ్చే ప్రాంతమని, గతంలో అండర్19 ప్రపంచకప్ ఫైనల్‌లోనూ ఇక్కడ మెరుగైన ప్రదర్శన కనబరిచారని జోషి గుర్తుచేశారు. కాగా, జోషి చేసిన ఈ వ్యాఖ్యలను బట్టి చూస్తే.. వైభవ్‌ను తొందరపడి అంతర్జాతీయ స్థాయిలో బౌలర్‌గా వినియోగించే ఆలోచనలో లేదని, దశలవారీగా పార్ట్‌టైమ్ ఆల్‌రౌండర్‌గా తీర్చిదిద్దాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది.

**బౌలింగ్ అనుభవం**

వైభవ్ ఎడమచేతి ఆఫ్ స్పిన్నర్‌గా పార్ట్‌టైమ్ బౌలింగ్ చేస్తాడు. డొమెస్టిక్ క్రికెట్‌లో అతని బౌలింగ్ అనుభవం పరిమితం. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అతని ఖాతాలో కేవలం రెండు వికెట్లు మాత్రమే ఉన్నాయి. లిస్ట్‌ఏ క్రికెట్‌లో మూడు ఇన్నింగ్స్‌లు బౌలింగ్ చేసి 56 పరుగులు ఇచ్చాడు. టీ20ల్లో రెండు మ్యాచ్‌ల్లో బౌలింగ్ చేసినప్పటికీ ఒక్క వికెట్ కూడా దక్కలేదు. ఐపీఎల్‌లో ఇప్పటివరకు ఒక్కసారి కూడా బౌలింగ్ చేసిన దాఖలాలు లేవు. మొత్తంగా బౌలింగ్‌లో దాదాపు అనుభవం లేని వైభవ్‌ను సరైన శిక్షణతో తీర్చిదిద్దగలిగితే, భారత జట్టు కూర్పుకు మరింత వైవిధ్యం చేకూరే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత కోచ్ గౌతమ్ గంభీర్ శిక్షణలో ఆల్‌రౌండర్లకు పెరుగుతున్న ప్రాధాన్యం దృష్ట్యా ఈ నిర్ణయం ఆశ్చర్యకరం కాదని కథనాలు పేర్కొంటున్నాయి.



# ఫైనల్‌కు దూసుకెళ్లిన అనాహత్.. 21 ఏళ్ల రికార్డు బద్దలు

ప్రపంచ స్క్వాష్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ అనాహత్ సింగ్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో అనాహత్ 31 (113, 811, 114, 116) తేడాతో మూడో సీడ్ బార్బ్ సమెహ్ (ఈజిప్ట్)పై విజయాన్ని అందుకుంది. తద్వారా 21 ఏళ్ల తర్వాత ప్రపంచ స్క్వాష్ జూనియర్ చాంపియన్‌షిప్ ఫైనల్ చేరిన రెండో క్రీడాకారిణిగా అనాహత్ సింగ్ రికార్డుల కెక్కింది. 2005లో జోష్నా చినప్ప ఈ టోర్నీలో ఫైనల్ చేరిన తొలి క్రీడాకారిణిగా నిలిచింది. ఫైనల్ బెర్తు ఖరారు చేసుకున్న అనాహత్ ప్రపంచ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో వరుసగా రెండో ఏడాది కూడా పతకాన్ని ఖరారు చేసుకుంది. తద్వారా ఈ చాంపియన్‌షిప్ చరిత్రలో రెండు పతకాలు నెగ్గిన తొలి భారతీయ స్క్వాష్ ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పనుంది. గతేడాది కైరోలో జరిగిన ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్‌లో అనాహత్ సెమీఫైనల్లో ఓడిపోయి కాంస్యాన్ని సాధించింది. మ్యాచ్ విషయానికొస్తే నాలుగు గేమ్‌ల పాటు జరిగిన మ్యాచ్‌లో అనాహత్ తొలి గేమ్‌ను 113తో గెలుచుకోగా, రెండో గేమ్‌ను మాత్రం ప్రత్యర్థికి కోల్పోయింది. అయితే ఆ తర్వాత వరుసగా మూడు, నాలుగు గేముల్లో విజృంభించిన అనాహత్ గేమ్‌లతో పాటు మ్యాచ్‌ను కూడా కైవసం చేసుకుంది. మ్యాచ్ విజయం అనంతరం అనాహత్ మాట్లాడుతూ.. 'ఈ ప్రదర్శన పట్ల చాలా సంతోషంగా ఉన్నా. బ్రిటీష్ జూనియర్ ఓపెన్‌లో ఇదే బార్బ్‌ను ఎదుర్కొన్నా, అప్పుడు పరిస్థితులు నాకు కఠినంగా ఉన్నాయి. కానీ ఈసారి ఆ తప్పిదం చేయకూడదని మొదటి నుంచి గెలుపు కోసమే ప్రయత్నించాను. అయితే క్వార్టర్స్‌లో నమోదు చేసిన ప్రదర్శనను ఇక్కడ పునరావృతం చేయడంలో విఫలమైనప్పటికీ సెమీస్‌లో విజయం నాకు సంతృప్తినిచ్చింది. ఫైనల్లో అడుగుపెట్టడం ద్వారా నా తల్లిదండ్రులను, కోచ్‌లను హ్యాపీ చేయగలిగాను. కానీ ఫైనల్ గెలిస్తేనే నాకు ముగింపు' అని చెప్పుకొచ్చింది.

# కాంస్యంతో మెరిసిన 'రిక్షావోడు'.. కామన్‌వెల్త్ గేమ్స్‌లో భారత్ బోణీ

గ్లాస్కో వేదికగా జరుగుతున్న కామన్‌వెల్త్ గేమ్స్‌లో భారత్ పతకాల బోణీ చేసింది. పురుషుల పారా పవర్‌లిఫ్టింగ్ హెవీవెయిట్ కేటగిరీలో ఝుండు కుమార్ కాంస్యంతో మెరిశాడు. గ్రూప్‌బి నుంచి బరిలోకి దిగిన ఝుండు తన రెండో ప్రయత్నంలో 190 కేజీల బరువును ఎత్తి 130.9 పాయింట్లు స్కోరును సాధించాడు. ఇప్పటివరకు ఝుండు కెరీర్‌లో అత్యుత్తమంగా ఉన్న 198 కేజీల బరువును అధిగమించనప్పటికీ తాజా కామన్‌వెల్త్ గేమ్స్‌లో మాత్రం కాంస్యాన్ని ఒడిసిపట్టాడు. మూడో ప్రయత్నంలో 196 కేజీల బరువు ఎత్తే ప్రయత్నంలో విఫలమయ్యాడు. అయినప్పటికీ తన కంటే ఎక్కువగా ఎవరు బరువు ఎత్తకపోవడంతో గ్రూప్‌బి నుంచి తొలి స్థానంలో, ఓవరాల్‌గా మూడో స్థానంలో నిలిచి పతకం ఖాయం చేసుకున్నాడు. ఇక నైజీరియాకు చెందిన రిలువాన్ ఇద్రిస్ 208 కిలోల బరువు ఎత్తి 132.8 పాయింట్లు సాధించి పోడియంపై తొలి స్థానంలో నిలిచి బంగారు పతకం అందుకున్నాడు. ఇక 199 కిలోల బరువు ఎత్తిన ఇంగ్లండ్‌కు చెందిన మాథ్యూ హార్డింగ్ 131 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి వెండిని కైవసం చేసుకున్నాడు. ఇక కాంస్య పతకం గెలుచుకున్న అనంతరం ఝుండు కుమార్ మాట్లాడాడు. 'నా ప్రదర్శన పట్ల సంతృప్తిగా ఉన్నా. భారత్‌కు ఇది చాలా ముఖ్యం. ఈ గేమ్స్‌లో నాదే దేశానికి తొలి పతకం కావడాన్ని మాటల్లో వర్ణించలేకపోతున్నా. జాతీయ జెండాను పోడియంపై చూసినప్పుడు గర్వంగా ఫీలయ్యాను. థాంక్యూ ఇండియా. నా ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. నేను పతకం గెలిచిన విషయాన్ని ముందుగా ఇంట్లో అమ్మానాన్నలకు చెప్తాను. అలాగే, చిన్నప్పటి నుంచి నాకు అండగా నిలిచిన నా స్నేహితుడు గౌతమ్ భయ్యాకు కూడా విషయాన్ని చెప్పాలి' అంటూ ఎమోషనల్ అయ్యాడు.



**ఈ-రిక్షా నుంచి వెయిట్‌లిఫ్టర్ దాకా**

పేదరికం విజయకాంక్షను పెంచుతుందనే మాట పారా పవర్‌లిఫ్టర్ ఝుండు కుమార్ సాధించిన ఘనత ద్వారా మరోసారి నిరూపితమైంది. హర్యానాకు చెందిన ఒక కూరగాయల వ్యాపారి కుమారుడైన ఝుండు ఒక ఈరిక్షా డ్రైవర్‌గా తన జీవితాన్ని ప్రారంభించాడు. హర్యానాలోని ది రాక్ స్టార్ జిమ్ యజమాని గౌతమ్ సింగ్ రాకతో ఝుండు జీవితం పూర్తిగా మారిపోయింది. ఇటీవల ముగిసిన ఖేలో ఇండియా పారా గేమ్స్ (కేఐపీజీ)లో స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. మార్చి 23న జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని వెయిట్‌లిఫ్టింగ్ హాల్‌లో జరిగిన పురుషుల 72 కేజీల విభాగంలో, ఆ పవర్‌లిఫ్టర్ 206 కేజీల బరువును ఎత్తి తన సొంత జాతీయ రికార్డును బద్దలు కొట్టి అగ్రస్థానంలో నిలిచాడు. మార్చి 1718 తేదీలలో నోయిడాలో జరిగిన పారా నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో ఝుండు 205 కేజీల బరువును ఎత్తి, సుధీర్ కుమార్ యొక్క 192 కేజీల జాతీయ రికార్డును బద్దలు కొట్టాడు.

**పుట్టుకతో పోలియో**

28 ఏళ్ల అతనికి పుట్టుకతోనే పోలియో సోకిన కాళ్లు ఉన్నాయి. అతని పారా స్పోర్ట్స్ ప్రయాణం 2017లో ప్రారంభమైంది. మొదట్లో, అతను షాట్‌పుట్, డిస్కస్ త్రోలో పోటీపడ్డాడు. ఆ సమయంలో, అతనికి పారా పవర్‌లిఫ్టింగ్ గురించి తెలియదు. F55 కేటగిరీలో, ఝుండు అనేక షాట్‌పుట్, డిస్కస్ త్రో ఈవెంట్లలో పాల్గొని విజయం సాధించాడు, కానీ అతని గమ్యం వేరే చోట ఉండటంతో, విధి అతన్ని ఆ దిశగా నడిపించింది. కష్టాలతో కూడిన ప్రయాణం తర్వాత, అతను గాంధీనగర్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కి చేరుకున్నాడు. ప్రముఖ పారా కోచ్ రాజిందర్ సింగ్ రాహేలు మార్గదర్శకత్వంలో పవర్ వెయిట్‌లిఫ్టర్‌గా కెరీర్ ప్రారంభించాడు. డిసెంబర్ 2023లో, తొలి ఎడిషన్‌లో పవర్‌లిఫ్టింగ్ విభాగంలో ఝుండు కుమార్ రజత పతకాన్ని గెలుచుకున్నాడు. 2028 లాస్ ఏంజెలెస్ పారా ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలవడమే తన లక్ష్యమని ఝుండు కుమార్ పేర్కొన్నాడు.

**ప్రధాని మోదీ అభినందనలు**

కామన్‌వెల్త్ గేమ్స్‌లో దేశానికి తొలి పతకం అందించిన ఝుండు కుమార్‌కు ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా అభినందనలు తెలిపారు. 'కామన్‌వెల్త్ గేమ్స్‌లో పురుషుల హెవీవెయిట్ పారా పవర్‌లిఫ్టింగ్ ఈవెంట్‌లో కాంస్యం గెలిచిన ఝుండు కుమార్‌కు అభినందనలు. అతడి అద్భుత ప్రదర్శనతో భారత్ పతకాల పట్టికను తెరవడం గొప్ప విషయం. అతడి విజయం అపారమైన శక్తికి, అతడి సంకల్పానికి, ఎన్నో ఏళ్ల తరబడి క్రమశిక్షణకు నిదర్శనం. తన జీవితంలో ఎదురైన ప్రతీ సవాల్‌ను అధిగమించి ఇవాళ అంతర్జాతీయ వేదికపై మువ్వన్నెల జెండాను ఎగురవేసి దేశానికి గర్వకారణంగా నిలిచి భారతీయులందరికి స్ఫూర్తిగా నిలిచాడు.' అని మోదీ కొనియాడారు.

# పాక్‌ను చిత్తుగా ఓడించిన భారత్



ఎఫ్ఐహెచ్ యూత్ హాకీ5స్ ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత సబ్‌జూనియర్ బాలుర జట్టు చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌పై 73 తేడాతో ఘన విజయం సాధించింది. ఇదే రోజు ఆతిథ్య ఒమాన్‌ను 101తో చిత్తు చేసి వరుస విజయాలతో అదరగొట్టింది. పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో రోమిత్ పాల్, కరణ్ గౌతమ్, కెప్టెన్ కేతన్ కుష్వాహా తొలి అర్ధభాగంలోనే గోల్స్ చేసి భారత్‌కు 30 ఆధిక్యం అందించారు. అనంతరం ప్రహ్లాద్ రాజ్‌భర్, షారుఖ్ అలీ, రాహుల్ యాదవ్, కేతన్ కుష్వాహా మరోసారి గోల్స్ చేయడంతో భారత్ సునాయాసంగా విజయం సాధించింది. అంతకుముందు ఒమాన్‌తో జరిగిన మ్యాచ్‌లో కేతన్ కుష్వాహా నాలుగు గోల్స్‌తో మెరవగా, షారుఖ్ అలీ, కరణ్ గౌతమ్, ప్రహ్లాద్ రాజ్‌భర్ తలో రెండు గోల్స్ చేసి భారత్‌కు 101 తేడాతో భారీ విజయాన్ని అందించారు. మరోవైపు బాలికల ఎలైట్ పూల్ మ్యాచ్‌లో భారత సబ్‌జూనియర్ జట్టు చైనాతో పోరాడినా 36 తేడాతో ఓటమి పాలైంది. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి స్కోరు 33తో సమంగా ఉన్నప్పటికీ, రెండో అర్ధభాగంలో చైనా ఆధిపత్యం చెలాయించి విజయాన్ని అందుకుంది. ఈ టోర్నీ ద్వారా ప్రారంభ ఎఫ్ఐహెచ్ యూత్ హాకీ5స్ ప్రపంచకప్‌కు ఆసియా జట్ల ఎంపిక కూడా జరగనుంది.

# భారత్‌లో పర్యటించనున్న బ్రెజిల్ ఫుట్‌బాల్ జట్టు..?

భారత్‌లో ఫుట్‌బాల్ అభిమానులకు శుభవార్త అందే అవకాశం కనిపిస్తోంది. ఐదు సార్లు ప్రపంచ ఛాంపియన్ బ్రెజిల్ జాతీయ ఫుట్‌బాల్ జట్టు ఈ ఏడాది అక్టోబర్‌లో భారత్‌లో ఓ అంతర్జాతీయ స్నేహపూర్వక మ్యాచ్ ఆడే దిశగా చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. బ్రెజిల్ ఫుట్‌బాల్ సమాఖ్య ఇప్పటికే సెప్టెంబర్ 25న టౌన్స్‌విల్లే, సెప్టెంబర్ 29న బ్రిస్బేన్‌లో ఆస్ట్రేలియాతో రెండు మ్యాచ్‌లు ఖరారు చేసింది. వీటికి అదనంగా అక్టోబర్ తొలి వారంలో భారత్‌లో మరో ఫ్రెండ్లీ మ్యాచ్ నిర్వహించే అంశంపై చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడించింది. ఈ మ్యాచ్‌కు ప్రత్యర్థి జట్టును ఇంకా ఖరారు చేయలేదు. ఈ మ్యాచ్‌కు కోల్‌కతా వేదికగా ఎంపికయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు నివేదిక పేర్కొంది. 2026 ఫిఫా ప్రపంచకప్ సందర్భంగా అమెరికాలో జరిగిన చర్చల తర్వాత ఈ ప్రణాళిక రూపుదిద్దుకుందని సమాచారం. ప్రపంచకప్ సమయంలో కోల్‌కతాలో వేలాది మంది అభిమానులు బ్రెజిల్ జెర్సీలు ధరించి సందడి చేయడం.. నెయ్‌మార్, వినీసియస్ జూనియర్ చిత్రాలతో నగరం కళకళలాడడం దృష్టిని ఆకర్షించిందని తెలుస్తోంది. అన్ని చర్చలు విజయవంతంగా పూర్తైతే, తుది ఒప్పందంపై సంతకాలు జరిగి బ్రెజిల్ జట్టు భారత్‌లో అడుగుపెట్టే అవకాశం ఉంది. దీంతో భారత ఫుట్‌బాల్ అభిమానులకు ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజాలను ప్రత్యక్షంగా చూసే అరుదైన అవకాశం లభించనుంది.



# 30 ఏళ్లకే వీడ్కోలు.. ఊహించని ట్విస్ట్‌తో మాజీ చాంప్ రీఎంట్రీ!

మాజీ యూఎస్ ఓపెన్ చాంపియన్, ఆస్ట్రియా మాజీ టెన్నిస్ ప్లేయర్ డొమినిక్ థీమ్ మళ్లీ గ్రౌండ్‌లో అడుగుపెట్టనున్నాడు. కెరీర్ పీక్ దశలో ఉన్నప్పుడే 30 ఏళ్ల వయసులో థీమ్ అనూహ్యంగా టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పి క్రీడా ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురి చేశాడు. అయితే రెండేళ్ల తర్వాత మాజీ చాంపియన్ రీఎంట్రీ ఇస్తున్నప్పటికీ ఇక్కడే ఊహించని ట్విస్ట్ ఒకటి దాగుంది. అదేంటంటే థీమ్ ఈసారి టెన్నిస్ ప్లేయర్‌గా కాకుండా ఫుట్‌బాలర్‌గా అడుగుపెట్టనుండడమే! ఆస్ట్రియా ఫుట్‌బాల్ లీగ్‌లో డొమినిక్ థీమ్ మ్యాచ్‌లు ఆడేందుకు సిద్ధమయ్యాడు. పలు నివేదికలు అందించిన సమాచారం మేరకు డొమినిక్ థీమ్ ఇప్పటికే ఆస్ట్రియాకు చెందిన అమెచ్యూర్ ఫుట్‌బాల్ క్లబ్ అయిన బాడెనర్ ఏసీ తరఫున తన పేరును రిజిస్టర్ చేయించుకున్నట్లు తెలుస్తోంది. టెన్నిస్‌కు రిటైర్మెంట్ ఇచ్చిన తర్వాత తన హోమ్‌టౌన్ క్లబ్ ఎస్‌సీ లిచ్టెన్‌వర్త్ (బాడెనర్ క్లబ్‌లో జాయిన్ కాకముందు) తరఫున పది మ్యాచ్‌లు ఆడిన డొమినిక్ థీమ్ ఒక గోల్ కూడా చేయడం విశేషం. టెన్నిస్‌లో స్టార్ ఆటగాడి హోదా పొందినప్పటికీ, ఫుట్‌బాల్‌లో మాత్రం ఒక సాధారణ ప్లేయర్‌గా కొనసాగుతున్నాడు. అందుకే అతడు ప్రాతినిధ్యం వహిస్తున్న ఫుట్‌బాల్ క్లబ్ కూడా ఇప్పటికీ డ్రెసింగ్ రూమ్‌లో ప్రత్యేక లాకర్ లేదా ఇతర సదుపాయాలు ఇవ్వలేదు.



**వరుస గాయాలతో వీడ్కోలు..**

2020 యూఎస్ ఓపెన్ చాంపియన్‌గా నిలిచిన డొమినిక్ థీమ్ 2024లో టెన్నిస్‌కు వీడ్కోలు పలికాడు. అప్పటికీ 30 ఏళ్ల వయసు మాత్రమే ఉన్న డొమినిక్ థీమ్ అనూహ్యంగీ వీడ్కోలు పలకడం వెనుక వరుస గాయాలు అతడిని ఇబ్బంది పెట్టడమే. 2020లో యూఎస్ ఓపెన్ గెలిచిన తర్వాత 2021లో ఏడుసార్లు మణికట్టు గాయానికి గురవ్వడంతో రెండేళ్ల పాటు ఆటకు దూరమవ్వాల్సి వచ్చింది. కెరీర్‌లో పీక్ ఫామ్‌లో ఉన్న సమయంలో వరుస గాయాలకు తోడు 2024లో యూఎస్ ఓపెన్‌లో తొలి రౌండ్‌లోనే డొమినిక్ థీమ్ ఇంటిబాట పట్టాడు. దీంతో టెన్నిస్‌కు వీడ్కోలు పలకాలని ఆరోజే నిర్ణయం తీసుకున్నాడు. ఇక వియన్నా ఓపెన్‌లో తొలి రౌండ్‌లో ఇటలీకి చెందిన లూసియానో దార్డేరి చేతిలో రెండు సెట్లలోనే డొమినిక్ థీమ్ పరాజయం చవిచూశాడు. టెన్నిస్‌లో థీమ్‌కు ఇదే ఆఖరి మ్యాచ్ కావడం విశేషం. 30 ఏళ్ల వయసులో పీక్ ఫామ్‌లో ఉన్నప్పుడు వరుస గాయాలు ఇబ్బంది పెట్టడంతో టెన్నిస్‌ను వదిలేసిన డొమినిక్ థీమ్ రెండేళ్ల తర్వాత సరికొత్తగా మారి ఫుట్‌బాల్ ఆటలో అడుగుపెడుతున్నాడు. మరి ఫుట్‌బాల్‌లో డొమినిక్ థీమ్ మెరుస్తాడా లేదా అన్నది చూడాలి.

# కామన్వెల్త్ చరిత్రలో కొత్త రికార్డు.. ఏకంగా 19 పతకాలు!

దక్షిణాఫ్రికా స్టార్ ఈతగాడు చాడ్ లె క్లోస్ కామన్వెల్త్ గేమ్స్ చరిత్రలో కొత్త రికార్డు సృష్టించాడు. పురుషుల 4×100 మీటర్ల ఫ్రీస్టైల్ రిలేలో కాంస్య పతకం గెలిచి.. ఈ గేమ్స్‌లో అత్యధిక మెడల్స్ సాధించిన పురుష అథ్లెట్‌గా నిలిచాడు. ఈ కాంస్యంతో అతడి ఖాతాలో మొత్తం 19 కామన్వెల్త్ పతకాలు చేరాయి. దీంతో 18 పతకాలతో అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియా షూటర్ ఫిల్ ఆడమ్స్, ఇంగ్లాండ్ షూటర్ మిక్ గాల్ట్‌ల రికార్డును అధిగమించాడు. ఇప్పటి వరకు లె క్లోస్ ఏడు స్వర్ణాలు, నాలుగు రజతాలు, ఎనిమిది కాంస్యాలతో మొత్తం 19 పతకాలు సాధించాడు. ఈ విజయంపై 34 ఏళ్ల లె క్లోస్ స్పందిస్తూ "కాంస్యం వచ్చిందని బాధపడను. స్వర్ణం రాలేదని నిరాశగా ఉంది. ఈ రికార్డు నాకు చాలా విలువైనది" అని చెప్పాడు. క్లోస్ పతకాల వేట ఇంకా ముగియలేదు. అతడు 50 మీటర్లు, 100 మీటర్ల బటర్‌ఫ్లై విభాగాల్లో కూడా పోటీపడనున్నాడు. దీంతో పతకాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఒలింపిక్స్, ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో కూడా లె క్లోస్ అద్భుత విజయాలు సాధించాడు. ఇప్పటివరకు ఒలింపిక్స్‌లో ఒక స్వర్ణం సహా నాలుగు పతకాలు గెలిచాడు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో 16 టైటిళ్లు సొంతం చేసుకున్నాడు.




# మెగా 158లో భద్రం కీలక రోల్

## చిరును కలిసి కృతజ్ఞతలు తెలిపిన సోము వీర్రాజు



మెగాస్టార్ చిరంజీవి కొత్త ప్రతిభను ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుంటారనే విషయం మరోసారి చర్చనీయాంశమైంది. దర్శకుడు బాబీ తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం మెగా158 లో ప్రముఖ హాస్యనటుడు డాక్టర్ భద్రంకు కీలక పాత్ర దక్కడం ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సందర్భంగా ఏపీ బీజేపీ నేత, ఎమ్మెల్సీ సోము వీర్రాజు స్వయంగా చిరంజీవిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ భద్రం తన అల్లుడు కావడంతో, ఆయనకు ఇలాంటి మంచి అవకాశం కల్పించినందుకు చిరంజీవికి వ్యక్తిగతంగా ధన్యవాదాలు తెలిపినట్లు సోము వీర్రాజు వెల్లడించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు, వివరాలను సోషల్ మీడియా ద్వారా పంచుకోవడంతో అవి ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ, కొత్త నటీనటులకు అవకాశాలు కల్పిస్తూ వారి ప్రతిభను వెలుగులోకి తీసుకురావడంలో చిరంజీవి ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. కళాకారులను ప్రోత్సహించే ఆయన విశాల హృదయం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే, 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి?బాబీ కాంబినేషన్‌లో వస్తున్న మెగా158 పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. ఈ చిత్రంలో డాక్టర్ భద్రంకు కథలో ప్రాధాన్యం ఉన్న పాత్ర లభించినట్లు సమాచారం. కమెడియన్‌గా ఇప్పటికే మంచి గుర్తింపు సంపాదించిన భద్రం, మెగాస్టార్‌తో కలిసి నటించే అవకాశం తన కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా నిలవనుంది. ముఖ్యంగా 'ప్రతి రోజూ పండగే' చిత్రంలో తన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న డాక్టర్ భద్రం, ఇప్పుడు చిరంజీవితో స్క్రీన్ షేర్ చేసుకోనుండటంతో ఆయన పాత్ర ఎలా ఉండబోతుందన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. మెగా158 లో చిరంజీవి మరోసారి పవర్‌ఫుల్ మాస్ అవతార్‌లో కనిపించనున్నారని, దర్శకుడు బాబీ తనదైన శైలిలో కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.




# హాలీవుడ్ సినిమాలకు దీటుగా 'రామాయణ'

## ప్రపంచ నలుమూలలకు వెళ్తుందని ఇన్‌స్టాలో పోస్ట్

నితేశ్ తివారీ దర్శకత్వంలో భారీ హంగులతో రూపుదిద్దుకుంటున్న సినిమా 'రామాయణ'. శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. శుక్రవారం విడుదల కావాల్సిన ఈ సినిమా ట్రైలర్ చివరి నిమిషంలో వాయిదా పడింది. అంతర్జాతీయ స్థాయిలో విడుదల చేయాలని భావించి ట్రైలర్‌ని వాయిదా వేస్తున్నాం. హాలీవుడ్ సినిమాలకు దీటుగా 'రామాయణ' ప్రపంచ నలుమూలలకు వెళ్తుందని పేర్కొంటూ ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు నిర్మాత నమిత్ మల్హోత్రా. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా అమెరికాలో జరుగుతోన్న శాన్ డియాగో కామిక్-కాన్ 2026 వేడుకల్లో చిత్రబృందం పాల్గొంది. ఈ సందర్భంగా వేడుకలో రణ్‌బీర్ మాట్లాడుతూ.. ఈ సినిమాలో అవకాశం వచ్చినప్పుడు నాలో చాలా భయం, సందేహం ఉండేవి. 'నేను ఇది చేయగలనా, నాకు అంత సామర్థ్యం ఉందా?' అనిపించేది. కానీ ఆ సందేహం చాలా త్వరగానే కృతజ్ఞతా భావంగా మారింది. ఇదొక వరం. జీవితంలో ఒక్కసారి మాత్రమే లభించే అవకాశం. తరతరాలుగా శ్రీరాముడు ఎంతో మందికి ఆత్మ రక్షకుడిగా ఉన్నారు. ధైర్యం, కరుణ, క్షమ, ధర్మం లాంటి వాటికి ఆయన ప్రతీకగా నిలుస్తారు. అలాంటి లక్షణాలకు ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం చాలా గొప్ప విషయం. దీనికి చాలా విశ్వాసం, నమ్మకం, నిజాయతీ అవసరమని ప్రారంభంలోనే అర్థం చేసుకున్నా. ఈ కథను ధ్యమైనంత వాస్తవికంగా చెప్పాలన్నదే మా నటీనటులు, సిబ్బందిల ఉన్నతమైన ఉద్దేశం అన్నారు. యశ్ మాట్లాడుతూ.. 'ఈ ప్రపంచంలో ఎవరూ వచ్చి 'నేను శ్రీరాముడి పాత్ర పోషించగలన'ని చెప్పలేరు. ఈ పాత్ర పోషించడం అంత సులభం కాదు. రణ్‌బీర్ గొప్పగా నటించారు. సినిమా చూసినప్పుడు అతని నిబద్ధత కనిపిస్తుంద'ని అన్నారు. రెండు భాగాలుగా విడుదల అవనున్న ఈ సినిమా మొదటి భాగం దీపావళికి థియేటర్లలోకి రానుంది.

# అర్థవంతమైన పాత్రలుంటేనే చేస్తా

## నిధి అగర్వాల్

సినిమాల్లో అవకాశాల కోసం తొందరపడడం లేదని నటి నిధి అగర్వాల్ అన్నారు. 'ఈశ్వరన్', 'భూమి', 'కళగ తలైవన్' తర్వాత తమిళ సినిమా చేయలేదని, సరైన ప్రాజెక్ట్ కోసం ఎదురు చూస్తున్నానని చెప్పారు. మంచి దర్శకులతో అర్థవంతమైన పాత్రలు ఉన్న సినిమాలు చేయాలనుకుంటున్నాను. అలాంటి పాత్రలకు తమిళ ఇండస్ట్రీ సరైన చోటు. నా జీవితంలో దేనికీ నేను తొందరపడను. పెళ్లి విషయంలో కూడా అంతే. మంచి ప్రాజెక్ట్‌లు వస్తే.. సినిమాలు చేస్తాను. 'హరి హర వీరమల్లు, 'ది రాజా సాబ్' సినిమాల్లో స్టార్‌లతో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ప్రస్తుతం తెలుగు, హిందీ సినిమాలతో బిజీగా ఉన్నాను. దీంతో తమిళంలో నటించడం మిస్ అవుతున్నా. నాది చాలా సున్నితమైన మనస్తత్వం. అందుకే భావోద్వేగాలు ఎక్కువగా బయటపెట్టను. వృత్తిపరంగా బాగా కష్టపడతాను. ఇతర విషయాలకొస్తే అత్యంత సోమరిని. ప్రస్తుతం రెండు ప్రాజెక్టుల గురించి చర్చలు జరుగుతున్నాయి. ఇంకా ఫైనల్ చేయలేదని నిధి తెలిపారు. ఇక, ప్రస్తుతం ఆమె 'మిరాయ్' పార్ట్-2, హిందీ సైకలాజికల్ థ్రిల్లర్ 'ది ఇన్‌ఫ్లుయెన్సర్'లో కనిపించనున్నారు.





# సౌండ్ ఇంజనీర్‌గా వస్తోన్న నారా రోహిత్

కథానాయకుడు నారా రోహిత్ జోరుమీదున్నారు. ఒకప్పుడు వైవిధ్యమైన కథలు, పాత్రలు ఎంచుకుని అలరించేవారు. ఆయన నుంచి సినిమా వస్తుందంటే ఏదో కొత్తదనం ఉందనే భావన ప్రేక్షకులకు కలిగేది. అయితే, కొంతకాలం విరామం తీసుకున్న నారా రోహిత్ గతేడాది 'భైరవం', 'సుందరకాండ' చిత్రాలతో మళ్లీ ట్రాక్‌లోకి వచ్చారు. ఇప్పుడు మరోసారి వరుస చిత్రాలతో అలరించడానికి సిద్ధమయ్యారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా కొత్త సినిమాల కబుర్లు పంచుకుంటున్నారు. రామ్ గన్నీ దర్శకత్వంలో రోహిత్ ఓ సినిమాలో నటిస్తున్నారు. దీనికి 'కపాలి' అనే టైటిల్, ఫస్ట్‌లుక్‌ను తాజాగా విడుదల చేశారు. పురాణాంశాలతో నిండిన సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ఇది రూపొందుతోంది. ఇక వెంకటేశ్-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'ఆదర్శ కుటుంబం: హౌస్ నెం.47'లోనూ నారా రోహిత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో ఆయన పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. ఈ లుక్‌ను కూడా చిత్ర నిర్మాణ సంస్థ హారిక హాసిని క్రియేషన్స్ శనివారం సోషల్‌మీడియా వేదికగా పంచుకుంది. దీంతో పాటు, చినిమిల్లి మణికుమార్ దర్శకత్వంలో ఓ వైవిధ్యమైన కథలో నారా రోహిత్ మెరవనున్నారు. ఈ సినిమాకు 'సౌండ్ ఇంజినీర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. పూర్తి వినోదాత్మక చిత్రంగా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. నయన్‌సారిక, నరేశ్, రోహిణి, అజయ్, వెన్నెల కిషోర్, సుదర్శన్, బ్రహ్మాజీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**